



కుక్కునూరు మండలం కొత్తలంకాలపల్లిలో ఎస్‌ఐ రాజారెడ్డి, పోలీస్ బృందం (ఇన్‌సెట్‌లో) తనిఖీలు

ఉలికిపాటు..!



మావోయిస్టులు అద్దెకు వున్న భవనం ఇదే

ఏలూరులో 15 మంది మావోయిస్టుల అరెస్టు

- గ్రీన్‌సిటీలోని ఓ భవనంలో నెల రోజులుగా నివాసం
- వీరిలో ఐదుగురు మహిళలు, తొమ్మిది మంది పురుషులు
- వట్లూరు సమీపంలోని ప్రైవేటు హాస్టల్‌లో మరో విద్యార్థి..
- ఎస్పీ కిశోర్ ఆధ్వర్యంలో మఫ్టీలో చుట్టుముట్టిన పోలీసులు
- 45 నిమిషాల్లో ముగిసిన ఆపరేషన్.. భారీ భద్రత మధ్య విచారణ
- ఉలిక్కిపడిన ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజలు

ఏలూరు క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మంగళవారం ఉదయం ఏలూరు నగరం ప్రశాంతంగా వుంది. ఎవరి పనుల్లో వారు బిజీగా వున్నారు. ఉదయం 11 గంటల సమయంలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. నగరంతోపాటు జిల్లా పోలీసులు అలర్ట్ అయ్యారు. అన్ని పోలీసు స్టేషన్‌లలో వున్న వారిలో ఎక్కువ మంది మఫ్టీలోకి మారిపోయారు. ఆఘమేఘాల మీద ఏలూరు మినీ బైపాస్‌లో ఉన్న కేకేఆర్ గ్రీన్ సిటీ సమీపానికి చేరుకున్నారు. వివిధ మార్గాల నుంచి ఒక్కొక్కరు అడుగులు వేసుకుంటూ వచ్చారు. కొందరు రోడ్లు తుడిచే వారుగా, మరికొందరు కూలీలుగా ఆ ప్రాంతంలో తిరుగుతూ ఒక బిల్డింగ్ వద్దకు చేరుకున్నారు. ఏం జరుగుతుందో ఎవరికి తెలియడం లేదు. ఓ వైపు ఆకాశంలో డ్రోన్ కెమెరాలు ఎగురుతున్నాయి. ఆ ప్రాంతం వీధుల చివర పోలీసు జీపులు వచ్చి చేరుతున్నాయి. మరో 20 నిమిషాలు గడిచేసరికి గ్రీన్‌సిటీలో వున్న డోర్ నెంబర్ 22-136-9 వడ్లమూడి నాగభూషణాచార్యులు, పార్వతి ప్రసన్నం పేరు మీద ఉన్న శ్రీ సాయి నివాసం భవనాన్ని చుట్టుముట్టారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాపశివకిశోర్ సైతం మఫ్టీలో ప్రత్యక్షమయ్యారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఇతర ప్రాంతాల ఎస్‌ఐలు, సీఐలు, సిబ్బంది అక్కడే కనిపించారు. అంతలోనే విజయవాడ నుంచి వచ్చిన 30 మంది గ్రేహౌండ్స్ పోలీసులు బులెట్‌ప్రూఫ్ జాకెట్లతో ఆ భవనంలోకి ఒక్కసారిగా ప్రవేశించారు. క్షణాల వ్యవధిలో లోపల ఐదుగురు మహిళలు, తొమ్మిది మంది పురుషులను ముసుగులు వేసి బయటకు తీసుకువచ్చారు. అప్పటికే సిద్ధంగా వుంచిన బస్సులో వారిని ఎక్కించారు. ఇంతలో మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో ఆరుగురి మృతి, పలుచోట్ల మావోయిస్టుల అరెస్టుల వార్తలు రావడంతో.. వీరు కూడా మావోయిస్టులు అయ్యి వుంటారని స్థానికులు భావించారు. వీరి ఊహించినది కరెక్టేనని తర్వాత పోలీసులు నిర్ధారించడంతో మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. దీంతో ఈ ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.





మహిళా మావోయిస్టులను భవనం నుంచి బయటకు తీసుకొస్తున్న మఫ్టీలో ఉన్న మహిళా పోలీసులు

భవనం వద్దకు మఫ్టీలో చేరుకున్న పోలీసులు

మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌తో..

కోట్లాది రూపాయల రివార్డు వున్న మోస్టు వాంటెడ్ మావోయిస్టు నాయకుడు హిడ్మా, అతని భార్య, మరో నలుగురు మారేడుమిల్లిలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. అక్కడ లభించిన డైరీ, ఇతర ఆధారాలతోనే ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మావోయిస్టులు ఉన్నట్లుగా గుర్తించినట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఏలూరులో షెల్టర్ జోన్‌గా తలదాచుకున్న 14 మంది మావోలను అదుపులోకి తీసుకున్నారు. వీరిని పెదవేగి డీటీసీకి తీసుకువెళ్ళి అక్కడ నుంచి సాయంత్రానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఆ తరువాత సాయంత్రానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతనంగా నిర్మించి ఉన్న మహిళా పోలీస్ స్టేషన్ భవనంలో ఉంచి వారిని విచారిస్తున్నారు. మరోవైపు విజయవాడ నుంచి ప్రత్యేక ఉన్నతాధికారుల బృందం వచ్చి వారిని విచారిస్తున్నట్లు సమాచారం. బుధవారం వారి అరెస్టును మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. మావోయిస్టులను ఏలూరు నగరంలో అరెస్టు చేశారని తెలియడంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. వీరంతా నెల రోజుల నుంచి ఈ భవనంలో వుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. పగటి వేళ ఒకరిద్దరు కనపడేవారని, రాత్రి రెండు గంటల వరకూ లైట్లు వెలుగుతూ ఏవో శబ్దాలు వినిపించేవని చెప్పారు. వారు ఎవరితోనూ మాట్లాడేవారు కాదన్నారు. వీరు జిల్లాకు ఎందుకు వచ్చారు ? వారి ఏం చేయబోతున్నారనేది తేలాల్సి వుంది. షెల్టర్ జోన్‌గా వినియోగించుకోవడానికి వచ్చి.. పోలీసులకు చిక్కినట్లు భావిస్తున్నారు. దీనిపై పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.



వట్లూరు ప్రైవేటు హాస్టల్ నుంచి మావోయిస్టును అదుపులోకి తీసుకుని వెళ్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు

అడవుల నుంచి ఏలూరు వైపు

- మావోయిస్టుల కదలికలతో పోలీసులు అప్రమత్తం
- ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు
- ప్రైవేటు హాస్టల్స్, లాడ్జీలు, హోటల్స్‌పైన పోలీసు దృష్టి

షెల్టర్ జోన్‌లో ఎన్‌కౌంటర్లు.. అరెస్ట్‌లు !

ఏలూరు క్రైం/కుక్కునూరు నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి అడవుల్లో పోలీసులకు మావోయిస్టులకు జరిగిన కాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత హిడ్మా సహా మరో ఐదుగురు మృతి చెందడం, ఏలూరు, విజయవాడ, కాకినాడ నగరాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడిన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా కేంద్ర ఇంటిలిజెన్స్ శాఖ గతంలోనే గుర్తించింది. ఏలూరు జిల్లాకు సరిహద్దుకు గోదావరి నది వుంది. దీనికి అవతల వైపు ఛత్తీస్‌ఘడ్, ఏపీలోని అల్లూరి జిల్లా, తెలంగాణ ఏజెన్సీ గ్రామాలున్నాయి. పోలీసులకు, మావోయిస్టులకు తరచూ ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో షెల్టర్ జోన్‌గా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు ఉండే అవకాశం ఉందని పోలీస్ యంత్రాంగం నిఘా పెడుతోంది. కుక్కునూరు ఎస్‌ఐ రాజారెడ్డి స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్సు(ఎస్‌పీఎఫ్) సిబ్బందితో వలస ఆదివాసి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఆదివాసీలను కలిసి కొత్తగా ఎవరైనా గ్రామాలకు వచ్చారా ? అని ఆరా తీశారు. ఇంటింటికి తిరిగి పరిశీలిస్తున్నారు.

నగర ప్రాంతాలకు మావోలు

ఇటీవల కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక బలగాలు వరుస ఎన్‌కౌంటర్‌లతో పెద్ద సంఖ్యలో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేశారు. దీంతో వారికి పెద్ద ఎదురుదెబ్బ తగింది. అటవీ ప్రాంతం సురక్షితం కాదనుకున్నారో ఏమో కాని నగర ప్రాంతాల వైపు మావోలు దారి మళ్లించారు. సామాన్యులుగా, కూలీలుగా ఇళ్లను అద్దెకు తీసుకుని తమ కార్యకలాపాలు చాపకింద నీరులా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఏలూరులోని కెకెఆర్ గ్రీన్ సిటీలో ఒక భవనాన్ని అద్దెకు తీసుకుని, ఆ ఇంటికి సీసీ కెమెరాలు బిగించుకుని 14 మంది మావోలు ఇక్కడే ఉంటూ తమ కార్యకలాపాలు కొనసాగించారు. మరో విశేషం ఏమిటంటే వారు ఉన్న భవనానికి వంద మీటర్ల దూరంలోనే పోలీస్ శాఖకు అనుబంధంగా ఉన్న శాఖల్లో పనిచేసేవారు, వివిధ శాఖల అధికారులు నివాసాలు ఉన్నాయి. కానీ ఎవరికి అనుమానం రాకుండా నెల రోజుల నుంచి ఆ ఇంట్లో ఉంటూ తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు. వట్లూరులో మావోయిస్టు తలదాచుకున్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ హాస్టల్ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జిల్లాలోని లాడ్జీలు, హోటల్స్, ప్రైవేటు హాస్టల్స్‌కు తనిఖీలు చేపట్టడానికి అన్ని రకాల చర్యలు చేపట్టారు.



మావోయిస్టులను ఉంచిన మహిళా పోలీస్‌స్టేషన్ ఇదే..

రాష్ట్ర విభజనతో పెరిగిన భద్రత

ప్రశాంతంగా వుండే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాను ఒకప్పుడు నక్సల్స్, మావోయిస్టులు షెల్టర్స్ జోన్‌గా వినియోగించే వారు. 2000 నుంచి సుమారు పదేళ్లపాటు పలు ఎన్‌కౌంటర్లు, అరెస్ట్‌లు ■ లోపలి పేజీలో..

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల

- జిల్లా వ్యాప్తంగా లబ్ధిపొందే రైతులు 1,60,968.. మొత్తం రూ. 106.23 కోట్లు
- అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు రూ.5 వేలు, పీఎం కిసాన్ కింద రూ.2వేలు

నేటి నుంచి రైతుల బ్యాంకు ఖాతాలకు రెండో విడత సొమ్ములు

ఏలూరుసిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ పథకంలో ఈ ఏడాది రెండో విడత కింద రైతులకు సాయం అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్త య్యాయి. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఈ పథకం కింద గత ఆగస్టు రెండో తేదీన రైతులకు సాయం అందించగా.. తాజాగా మూడో నెలలో అంటే నవంబరు 19న బుధవారం రెండో విడత రైతులకు పెట్టుబడి సాయం అందించేం దుకు సర్వం సిద్ధమైంది. ఈ నిధులలో అన్నదాత సుఖీభవ కింద రెండో విడతగా రూ.5వేలు, పీఎం కిసాన్ కింద 21వ విడత సొమ్ములు రూ.2వేలను కలిపి మొత్తం రూ.7వేలను రైతుల బ్యాంకు ఖాతాల్లో చేరనున్నాయి.

జిల్లాలో లక్షా 60 వేల 968 మంది రైతులకు ఈ సాయం అందనుంది. ఈ పథకం కింద రూ. 8,048 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద రూ. 25.75 కోట్లు నిధులు కేటాయించగా ఈ రెండు పథకాలకు సంబంధించి జిల్లా మొత్తం ఎంపిక చేసిన 1,60,968 మంది రైతులకు మొత్తం రూ. 106.23 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తారు. ఇదిలా ఉండగా అన్నదాత-పీఎం కిసాన్ కింద తొలి విడతలో 7 వేల రూపాయలు, రెండో విడతలో 7వేల రూపాయలు, మూడో విడతలో 6 వేలు రూపాయలు కలిపి మొత్తం రూ.20 వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అర్హులైన రైతులకు అందజేస్తుంది. తాజాగా రెండో విడత అందించే సాయంతో రైతులకు ఈ ఏడాది అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద మొత్తం రూ.14 వేలు అందించినట్టవుతుంది. ఈ నగదు జమ వల్ల రైతులకు పెట్టుబడి సాయం అందడంతో పాటు అర్హులైన రైతులందరికీ ప్రయోజనం చేకూరనుంది.

రైతులకు ఊరట ..

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ సొమ్ములు బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత నిధులు విడుదల చేయడంతో రైతులకు ఊరట కలిగింది. ఏడాదికి అన్నదాత సుఖీభవ కింద రూ.14 వేలు, పీఎం కిసాన్ కింద రూ.6వేలు కలిపి మొత్తం రూ.20 వేలు ఒక్కొక్క రైతు కుటుంబానికి అందించను న్నారు. కౌలు రైతులకు మాత్రం ప్రభుత్వమే నేరుగా అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల పెట్టుబడి సాయం అందించనున్నారు. రాబోయే రోజుల్లో కౌలు రైతులకు ఈ పెట్టుబడి సాయం అందిస్తారని తెలుస్తోంది.

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కింద పీఎం కిసాన్ నిధులతో కలిపి ప్రతి ఏటా రైతులకు రూ.13,500 (రైతు భరోసా రూ.7,500, పీఎం కిసాన్ రూ.6వేలు) కొంతమంది రైతులకు మాత్రమే అందించారు.

మండలాల వారీగా ఇలా..

మండలం	రైతులు	రూ.కోట్లల్లో
ఏలూరు	2162	1.46
జంగారెడ్డిగూడెం	8182	5.39
చింతలపూడి	12,383	7.99
లింగపాలెం	8244	5.52
కామవరపుకోట	8,009	5.35
టి.నరసాపురం	9114	6.04
కొయ్యలగూడెం	8,304	5.52
బుట్టాయిగూడెం	6,096	4.14
పోలవరం	5,002	3.30
జీలుగుమిల్లి	3,284	2.02
కుక్కునూరు	1,669	1.14
వేలేరుపాడు	568	0.44
పెదవేగి	9,285	5.99
దెందులూరు	5,905	3.91
పెదపాడు	4,760	3.16
ఉంగుటూరు	8,111	5.32
భీమడోలు	3,589	2.45
నిడమర్రు	2,210	1.59
ఆగిరిపల్లి	10,009	6.54
నూజివీడు	9,240	6.09
ముసునూరు	8,205	5.48
చాట్రాయి	8,075	5.27
ముదినేపల్లి	4,909	3.28
మండవల్లి	1,997	1.33
కైకలూరు	1,234	0.87
కలిదిండి	771	0.59
ద్వారకాతిరుమల	9,651	6.04



నిర్లక్ష్యాన్ని వీడాల్సిందే..

- దిశ సమావేశంలో అధికారుల పనితీరుపై ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఆగ్రహం

■ లోపలి పేజీల్లో..

ఇద్దరు పిల్లలతో గోదావరిలోకి దూకిన తండ్రి



- తండ్రి, కుమారుడి మృతదేహాలు లభ్యం.. లభించని కుమార్తె ఆచూకీ

హెచ్‌ఎం సస్పెన్షన్

ఏలూరు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నభోజన పథకం బియ్యం, చిక్కీలు, కోడిగుడ్ల లెక్కల్లో వ్యత్యాసాలు న్నాయన్న అభియోగాలపై ఏలూ రు 16వ డివిజన్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.పార్వతిని సస్పెండ్ చేస్తూ పాఠశాలవిద్య ప్రాంతీయ సంయుక్త సం చాలకులు (కాకినాడ ఆర్జేడీ) జి.నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌ఎం సస్పెన్షన్‌ను డీఈవో వెంకటలక్ష్మమ్మ ధ్రువీకరిం చారు. భోజన పథకం బియ్యాన్ని అక్రమ మార్గాల్లో తరలించి విక్రయిస్తు న్నారన్న ఆరోపణలు గతనెలలో హెచ్‌ఎంపై వచ్చాయి. ఆ మేరకు విద్యాశాఖ సిబ్బంది స్కూలులో తనిఖీలు చేసి బియ్యం వినియోగం, మిగిలి ఉండాల్సిన నిల్వలను రికార్డులతో సరిపోల్చి భోజనపథకం సరుకుల్లో వ్యత్యాసము న్నట్టు తేల్చారు. ఉన్నతాధికారులకు అంద జేసిన నివేదిక మేరకు తాజాగా హెచ్‌ఎం సస్పెన్షన్ జరిగిందని విద్యాశాఖ వర్గాలు వివరించాయి.



నృత్య సమ్మోహనం

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి మాసోత్సవాల సందర్భంగా మంగళవారం ఏలూరు ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో 'యూనిటీ మార్చ్' నిర్వహించారు. 500 మంది విద్యార్థులతో యువత, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అలరించిన విద్యార్థిని నృత్యప్రదర్శన - ఏలూరు రూరల్

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ చిరునామా: డి.నెం: 22బి-13-8, 2వ ఫ్లోర్, వెంకట రామ పవర్ ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు-534002.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది, ఎన్.సి.ఎల్.టి బెంచ్-II, చెన్నై, తేది: 09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెని లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెని అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది. మరియు బ్రాంచి ఆఫీస్ చిరునామా: **తాడేపల్లిగూడెం** లో మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్.బి.ఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నము. (ఇక నుండి మమ్మల్నీ కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు).

ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదిల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదిలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందజేయబడకుండ తిరిగి వచ్చినందుకు సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత (లు) / సహ ఋణగ్రహీతలు / హామీదారు(లు) పేరు	ఎన్.పి.ఏ తేది ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది బకాయి మొత్తం
1. **సబ్బి ఆనందరావు,** తండ్రి: సబ్బి గంగన్న, డి.నెం: 6-80, చినపేట, వెంపా పోస్ట్, పశ్చిమ గోదావరి జిల్లా-534207. 2. **సబ్బి రాముడు,** తండ్రి: గంగన్న, డి.నెం: 6-80, చినపేట, వెంపా పోస్ట్, పశ్చిమ గోదావరి జిల్లా-534207. 3. **లోకం వెంకట రవి నాగ హనుమాన్ రామదాసు,** తండ్రి: వీర్రాజు, డి.నెం: 1-11/3, మెయిన్ రోడ్డు, కొత్త పాలెం, మొగల్తూరు, సెరెపాలెం, పశ్చిమ గోదావరి జిల్లా-534281.	31-12-2019 రూ. 14,50,000/- (అక్షరాలా పద్నాలుగు లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే)	24-10-2025 ది. 24-10-2025 తేది నాటికి రూ. 33,33,931/- (అక్షరాలా ముప్పై మూడు లక్షల ముప్పై మూడు వేల తొమ్మిది వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే)

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. TDPLMTF1903220001

శ్రీ సబ్బి రాముడు గారికి చెందిన ఆస్తి వివరములు: పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, మొగల్తూరు సబ్ జిల్లా, వెంప గ్రామ పంచాయతీ మరియు గ్రామ ఖాతాలా ప్రకారం, ఆర్.ఎస్. నెం. 320/9 లోని మొత్తం విస్తీర్ణం ఎకరా 0.58 సెంట్లలో నుంచి ఎకరా 0.04 సెంట్లు లేదా 193.6 చదరపు గజాలు లేదా 170 చదరపు మీటర్ల స్థలం మరియు దానిపై ఉన్న డి.నెం. 6-80, అసెస్‌మెంట్ నెం. 1007 గల ఆర్‌సిసి భవనం యొక్క హద్దులు: **తూర్పు:** సబ్బి శ్రీను గారికి అమ్మిన ఆస్తి, **దక్షిణం:** అమ్మకందారులు వదిలిన దారి, **పడమర:** అడపు వెంకటేశ్వర్లు గారి స్థలం, **ఉత్తరం:** కొంత వరకు కొనుగోలుదారు యొక్క భూమి, మరియు కొంత వరకు బి. నూకాలు గారి భూమి.

పైన పేర్కొన్న పరిస్థితులలో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్తు వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన పేర్కొన్న విధంగా చెల్లించవలసిన మిగులు బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదార్లు (వర్తించునపుడు) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ఆ విధంగా చేయుటలో విఫలమైతే ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(4) మరియు దాని క్రింద వర్తించే రూల్స్ క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా పెట్టిన వ్యక్తుల సెక్యూర్డ్ ఆస్తుల స్వాధీనం చేసుకొనుటతో సహా సెక్యూర్డ్ ఆస్తుల పైన తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద ఏ ఋణగ్రహీత సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా పొందకుండా నోటీసులో రిఫర్ చేసిన అతని సెక్యూర్డ్ ఆస్తులు వేటిని అమ్మకం, లీజు ఇతరత్రా బదిలీ చేయరాదని గమనించవలెను.

ప్రదేశం: ఏలూరు — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ చిరునామా: డి.నెం: 22బి-13-8, 2వ ఫ్లోర్, వెంకట రామ పవర్ ప్రెస్ రోడ్డు, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు-534002.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది, ఎన్.సి.ఎల్.టి బెంచ్-II, చెన్నై, తేది: 09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెని లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెని అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది. మరియు బ్రాంచి ఆఫీస్ చిరునామా: **చింతలపూడి** లో మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్.బి.ఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నము. (ఇక నుండి మమ్మల్నీ కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు).

ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదిల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదిలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందజేయబడకుండ తిరిగి వచ్చినందుకు సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత (లు) / సహ ఋణగ్రహీతలు / హామీదారు(లు) పేరు	ఎన్.పి.ఏ తేది ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది బకాయి మొత్తం
1. **బండి షణ్ముఖి,** తండ్రి: పుల్లయ్య, డి.నెం: 5-26, పాత ఆంధ్రా బ్యాంక్ రోడ్డు, జువ్వలపాలెం, అశ్వారావు పేట, ఖమ్మం జిల్లా-507301. 2. **యెర్ల వెంకటరత్నం,** డి.నెం: 1-21, చింతలపూడి, 4వ బ్లాక్, చింతలపూడి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా-534460. 3. **బండి సత్యనారాయణ,** తండ్రి: పుల్లయ్య, డి.నెం: 5-26, పాత ఆంధ్రా బ్యాంక్ రోడ్డు, జువ్వలపాలెం, అశ్వారావు పేట, ఖమ్మం జిల్లా-507301.	30-11-2012 రూ. 18,00,000/- (అక్షరాలా పద్దెనిమిది లక్షల రూపాయలు మాత్రమే)	24-10-2025 ది. 24-10-2025 తేది నాటికి రూ. 95,11,958/- (అక్షరాలా తొంభై ఐదు లక్షల పదకొండు వేల తొమ్మిది వందల యాభై ఎనిమిది రూపాయలు మాత్రమే)

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. CTLPITF1206290006

శ్రీ బండి సత్యనారాయణ గారికి చెందిన ఆస్తి వివరములు: ఖమ్మం జిల్లా, సత్తుపల్లి సబ్-రిజిస్ట్రీ, అశ్వారావుపేట మండలం, అశ్వారావుపేట పంచాయతీ మరియు రెవెన్యూ గ్రామ ఖాతాలా ప్రకారం, సర్వే నెం. 1242/4 లో గల ఎకరా 0.29 సెంట్లు లేదా 0.117 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న మెట్ట భూమి యొక్క హద్దులు: **తూర్పు:** లంక రాధాకృష్ణ గారికి చెందిన మెట్ట భూమి, **దక్షిణం:** రంగ నాగేశ్వరరావు గారికి చెందిన మెట్ట భూమి, **పడమర:** గనగవరపు దయాకర్ గారికి చెందిన మెట్ట భూమి, **ఉత్తరం:** అమ్మకందారు యొక్క భూమి.

పైన పేర్కొన్న పరిస్థితులలో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్తు వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన పేర్కొన్న విధంగా చెల్లించవలసిన మిగులు బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదార్లు (వర్తించునపుడు) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ఆ విధంగా చేయుటలో విఫలమైతే ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(4) మరియు దాని క్రింద వర్తించే రూల్స్ క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా పెట్టిన వ్యక్తుల సెక్యూర్డ్ ఆస్తుల స్వాధీనం చేసుకొనుటతో సహా సెక్యూర్డ్ ఆస్తుల పైన తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద ఏ ఋణగ్రహీత సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా పొందకుండా నోటీసులో రిఫర్ చేసిన అతని సెక్యూర్డ్ ఆస్తులు వేటిని అమ్మకం, లీజు ఇతరత్రా బదిలీ చేయరాదని గమనించవలెను.

ప్రదేశం: ఏలూరు — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఐసీఐ హైమావతి క్లబ్‌కు ఉత్తమ సేవా అవార్డు

ఏలూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సేవా సంస్థ ఇంపాక్ట్ ఐసీఐ ఇంటర్నేషనల్, జిల్లా స్థాయిల్లో ఉత్తమ సేవలందిస్తున్న క్లబ్బులకు అవార్డులు అందజేశారు. హైద్రాబాదులో మంగళవారం ప్రెసిడెంట్స్ మీట్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఏలూరు ఐసీఐ హైమావతి క్లబ్ చేస్తున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు గాను బెస్ట్ క్లబ్ అవార్డును ఎంఎల్ నరసింహారావు అందుకున్నారు. జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలు, అన్నదానం, స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించినందుకు ఈ అవార్డు అందజేసినట్టు తెలిపారు.

నేడు ఆయిల్ పామ్ రైతులకు ప్రత్యేక సదస్సు

ద్వారకాతిరుమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల విశాల సహకార సంఘ ఆవరణలో అంతర్జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఆయిల్ పామ్ రైతులకు సదస్సు నిర్వహిస్తామని సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నాబార్డ్ డీడీఎం టి.అనిల్‌కాంత్, ఏలూరు డీసీసీబీ డీపీడీఎంలు సాయికిరణ్, రమేష్, గోద్రేజ్ ఆయిల్‌పాం ఫ్యాక్టరీ అధికారులు హాజరవుతారని అన్నారు.

రేషన్ డీలర్లు సమయానికి షాపులు తెరవాలి

బుట్టాయగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లపై ప్రజల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.వి.చలపతిరావు హెచ్చరించారు. మంగళవారం కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్న డీలర్లను హెచ్చరించారు. ఏవేవో సాకులు చెప్పి సరుకులు ఇవ్వకుండా ప్రజలను పంపిస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. షాపులు సకాలంలో తెరవాలని, పద్ధతి మార్చుకోవాలని, కొలతల్లో తేడాలు లేకుండా చూసుకోవాలన్నారు. సీఎస్ఆర్ఐ పద్మ డీలర్లు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం

టి.నరసాపురం, నవంబరు 18(ఆంధ్రజోతి): రైతు సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ ఛైర్‌పర్సన్ అడపా నాగరాజు అన్నారు. మధ్యాహ్నపువారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. అడపా నాగరాజు మాట్లాడుతూ సొసైటీ సేవలను రైతులు వినియోగించుకోవాలన్నారు. నూజివీడు డివిజనల్ సహకార బ్యాంకు అధికారి రవికుమార్ మాట్లాడుతూ సొసైటీలు అందించే సేవలు వివరించారు. చింతలపూడి సబ్ డివిజన్ అధికారి టి.లక్ష్మణరావు, ఎ.కె.ఎస్.మూర్తి, ఎంపీటీసీ ఆళ్ళ బాలాజీ, సీఈవో జి.భుజంగరావు, పి.వి.రామయ్య, వి.సత్యనారాయణ, తమ్మిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

దళారులను నమ్మి ధాన్యం విక్రయించవద్దు: బొరగం



పోలవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి ధాన్యం విక్రయించి మోసపోవద్దని ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం పోలవరం మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రం-1ను ఆయన ప్రారంభించారు. ధాన్యం క్వింటాలుకు కామన్ ధాన్యం రూ.2,369, గ్రేడ్-ఎ రకం రూ.2,389 నిర్ణయించారన్నారు. మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం 17 లోపు ఉండేలా చూసుకోవాలన్నిప్రతి రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయన్నారు. కృష్ణారావుపేట సొసైటీ అధ్యక్షులు కొణతాల ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని, కొత్తూరు నీటి సంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్, సొసైటీ డైరెక్టర్లు ఎదిరేసి వెంకట్రావు, మిరియాల చంటి, కూటమి నేతలు నల్లా రాంబాబు, కోడి పోసిబాబు, బి.వెంకటలక్ష్మి, పి.శ్రీను పాల్గొన్నారు.

పెదవేగి సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రం..

పెదవేగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలతో దళారీ వ్యవస్థకు చెక్ పడిందని పెదవేగి సొసైటీ ఛైర్మన్ తాతా సత్యనారాయణ అన్నారు. పెదవేగి సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. పెదవేగి సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోలుకు 13 గ్రామాలను కేటాయించినట్టు ఆయన తెలిపారు. ఈకేవైసీ చేసిన ప్రతి రైతు ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించుకునే వెసులుబాటు ఉందన్నారు. పెదవేగి సొసైటీ పరిధిలో పెదవేగితో పాటు వంగూరు, కూచింపూడి గ్రామాల్లో మరో రెండు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. పెదవేగి, లక్ష్మీపురం గ్రామాల సర్పంచ్‌లు తాతా శ్రీరామ్మూర్తి, మేకా కనకరాజు, సొసైటీ డైరెక్టర్ కొమ్మిన సతీష్, గిత్తా సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొయ్యలగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.పోశారావు కోరారు. మంగళవారం మండలంలోని రాజవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండలంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. గ్రేడ్ ఏ ధాన్యానికి క్వింటాకు కామన్ రకానికి 2389, 2369 మద్దతు ధర ఇస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా 19వ తేదీ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ 2వ విడత డబ్బులు కూడా రైతు ఖాతాల్లో పడతాయని తెలిపారు.

రాష్ట్ర ఎలక్ట్రికల్ యూనియన్‌లో జిల్లా సంఘం విలీనం

ఏలూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్‌లో ఏలూరు జిల్లా ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్‌ను విలీనం చేస్తున్నట్టు ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు ప్రకటించారు. నూజివీడు నియోజకవర్గ ప్రైవేటు, ఎలక్ట్రికల్ వర్కర్స్, హెల్పర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన సమారాధనలో ఈ విలీనం నిర్ణయం తీసుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ రాయితీలు లబ్ధిదారులకు అందేలా పోరాడ్సాన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ రామకృష్ణ మాట్లాడుతూ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. రాజా రామ్మోహన్‌రావు, రాష్ట్ర ఎలక్ట్రికల్ ఆర్గనైజర్ సెక్రెటరీ కె.రాజ కుమార్, నూజివీడు ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఏలూరు జిల్లా ఎలక్ట్రికల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి ప్రగడ శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ నిధుల పంపిణీ

పెదవేగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ రెండవ విడత నిధులు బుధవారం విడుదల చేయనున్నారు. నియోజకవర్గంలోని దెందులూరు, పెదవేగి, పెదపాడు మండలాలకు సంబంధించి 19,950 మంది రైతుల ఖాతాలో అన్నదాత సుఖీభవ నిధులు రూ.9.98 కోట్లు, పీఎం కిసాన్ నిధులు రూ.3.09 కోట్లు రైతుల ఖాతాలో జమ కానున్నాయి. రైతులకు వారివారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమకానుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు రెండో విడత సొమ్మును వారి ఖాతాలో జమచేస్తున్నట్టు తెలిపారు.

మానవత సంస్థ ప్రతినిధి నూకరాజు మృతి

భీమడోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భీమడోలుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుని, మానవత సంస్థ ప్రతినిధి గుల్ల నూకరాజు అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఉపాధ్యాయునిగా మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధిగా నూకరాజు అనేక సేవలందించారు.

అడవుల నుంచి ఏలూరు వైపు

(5వ పేజీ తరువాయి)

జరిగినప్పటికి తర్వాత వారి జాడ తగ్గింది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం జిల్లాలో పోలీసు నిఘా పెంచారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తరచు కూంబింగ్ నిర్వహించేవారు. 2014 రాష్ట్ర విభజనతో తెలంగాణ నుంచి రెండు ఏజెన్సీ మండలాలు ఏలూరు జిల్లాలోకి వచ్చాయి. పోలవరంలో ప్రాజెక్టు నిర్మాణంతో ముఖ్యమంత్రులు, అధికారులు, వివిధ దేశాల నుంచి ఇంజనీర్లు వస్తున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టి ఏజెన్సీలో కూంబింగ్ చేస్తూనే ఉన్నారు.

ఎన్‌కౌంటర్లు.. అరెస్టులు

- గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా వున్న సమయంలో కుక్కునూరు మండలంలోనే పలు ఘటనలు జరిగాయి. ఓసారి గుర్తు చేసుకుంటే.. కుక్కునూరు మండలంలో గతంలో మావోయిస్టుల ఉనికి బయటపడింది.
- 2006 జూన్ 6న మావోయిస్టులు కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌ను పేల్చి వేశారు. రెడ్డిగూడెం అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు, కూంబింగ్ దళాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతి చెందారు.
- రేగులచెరువు ఆదివాసి గ్రామంలో నాటు తుపాకులు తయారు చేస్తూ ఆదివాసీలు పోలీసులకు దొరికారు.
- పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అప్పట్లో మండవ రామిరెడ్డి అనే కాంగ్రెస్ పార్టీ నాయకుడిని మావోయిస్టులు హతమార్చారు.
- 2000 మార్చి 17న బుట్టాయిగూడెం మండలం జలతారు వాగు వద్ద జరిగిన మొదటి ఎన్‌కౌంటర్‌లో వరంగల్‌కు చెందిన ఇద్దరు ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు, ఐదుగురు నక్సల్స్ మరణించారు. తర్వాత గూటాల ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు నక్సల్స్ చనిపోయారు. 2008 నవంబరు వరకూ మొత్తం ఎనిమిది ఎన్‌కౌంటర్లు జరిగాయి.
- 2002 మేలో ఏలూరులో జడ్పీ వద్ద పోలీసుల తనిఖీల్లో ఐదుగురు మావోయిస్టులు చిక్కారు.
- 1998లో విజయవాడ నుంచి రాయగడ పాసింజర్ రైలులో టిఫిన్ బాక్సులో పేలుడు పదార్థాలను తీసుకుని వస్తుండగా ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో జారిపడి పలువురు సంఖ్యలో చనిపోయారు.
- రాష్ట్ర విభజన అనంతరం మావోయిస్టుల ఉనికి కొంతమేర తగ్గింది. పలుమార్లు మావోయిస్టుల సాహిత్యానికి సంబంధించి పోస్టర్లు, కరపత్రాలు, వెలువడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

పరిష్కరించిన సమస్య మళ్లీ మొదటికే

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వీధి వ్యాపారుల తరలింపు

రైతు బజారు కాదని మళ్లీ రోడ్డెక్కిన వ్యాపారులు



వ్యాపారుల కోసం నిర్మించిన రైతు బజారు

పెదపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):ఆ రైతు బజారుకు సకల సౌకర్యాలున్నాయి.. అయినా నిరుపయోగంగా ఉంది. అందులో ఉండాల్సిన షాపులన్నీ రోడ్డెక్కడమే కారణం.. బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ కష్టాలు తప్పించేందుకు అధికారులు రహదారి పక్కన ఉన్న వ్యాపారుల దుకాణాలన్నీ బస్టాండ్ సమీపంలోని రైతు బజారులో ఏర్పాటు చేయించారు. అక్కడ వ్యాపారులు నిర్వహించుకునేందుకు విద్యుత్, నీటి సౌకర్యం కూడా కల్పించారు. రైతు బజారులో కొన్నాళ్లు వ్యాపారాలు నిర్వహించి ఆ తరువాత మరలా రోడ్డెక్కారు. దీంతో మళ్లీ ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. రైతుబజారును ఆనుకునే ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారంతా ఉదయం, సాయంత్రం అదే మార్గంలో రాకపోకలు సాగించాలి. వ్యాపారులంతా రోడ్డు ఆక్రమించడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతోంది. అక్కడే మోటారు సైకిళ్లు, ఆటోలు, ఇతర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఆ ట్రాఫిక్ వలయంలో పాఠశాలకు రాకపోకలు సాగించే చిన్నారులు చిక్కుకుని ప్రమాదం బారినపడతారేమోనని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఆ పక్కనే

తహసీల్దారు, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, పంచాయతీతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు వెళ్లే అధికారులంతా రోజూ ఇటుగానే ప్రయాణిస్తుంటారు. కానీ ఇక్కడి ట్రాఫిక్ కష్టాలను ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని స్థానికులు, పాదచారులు వాపోతున్నారు.



రోడ్డుకు చేర్చి నిర్వహిస్తున్న దుకాణాలు

మళ్లీ రైతు బజారుకు మారుస్తాం

రైతు బజారులో కేటాయించిన దుకాణాల్లోనే వ్యాపారులు నిర్వహించుకునేలా చర్యలు చేపడతాం. రోడ్ల పక్కల వ్యాపారులు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. రోడ్డుపై ఉన్న వ్యాపారులను తిరిగి రైతు బజారుకు పంపుతాం.

ఇందిరాగాంధీ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో,పెదపాడు

బాలల హక్కులపై అవగాహన

ఏలూరు క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జువైనల్ వెల్ఫేర్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్ ఆదేశాల మేరకు శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉప కార్మిక కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం కార్మికశాఖ ద్వారా సమాజంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన, బాలలకు విద్య, క్రమ శిక్షణపై కూడా సందేశాలిచ్చారు.వసతి గృహం సూపరింటెండెంట్ పి.శ్రీవల్లీ, ఉపాధ్యాయులు, పర్యవేక్షకులు జి.వెంటక రమణ, జె.గోపాలకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్: బాలలహక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక వైఎస్సార్ నగర్‌లో దళిత రిసోర్స్ సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహ అధ్యక్షుడు స్టీవెన్ మాట్లాడుతూ బాల్యాన్నిగడిపే హక్కును పిల్లలందరికీ రాజ్యాంగం కల్పించిందన్నారు. ట్రేస్ ఇండియా అధ్యక్షుడు డి.యాంజిలో మాట్లాడుతూ పేదరికం నుంచి బయటపడటానికి చదువు ఒక్కటే మార్గమన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎంవీఆర్ కృష్ణారావు మాట్లాడుతూ పిల్లలంతా శుభ్రమైన ఆహారం తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయురాలు కిరణ్ కుమారి, సెంటర్ కో-ఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

● పెదపాడు: ఏపూరు ప్రాథమిక పాఠశాలలో డీబీఆర్సీ ఆధ్వర్యంలో బాలలహక్కుల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. డీబీఆర్సీ ఏరియా కో-ఆర్డినేటర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్సీ) వారోత్సవాలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే టెన్త్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించడానికి ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తోందని జిల్లా పరీక్షల నిర్వహణ సహాయ కమిషనర్ ఆర్.ఆశ అన్నారు. మంగళవారం జంగారెడ్డిగూడెంలోని టెన్త్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని శ్రీనివాసపురం హైస్కూల్‌ను పరిశీలించారు. ఆమెతో పాటు డీవైఈవో రామన్నదొర, ఎంఈవోలు బి.రాములు, జి.రాములు పాల్గొన్నారు.



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న ఎంపీ పుట్టా మహేశ్

ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎంపీ పుట్టా

ఏలూరు క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రాత్రి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు.రాత్రి 11.30 సమయంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దాదాపు 45 నిమిషాలు అన్ని విభాగాలను కలియ తిరిగి పలువురు రోగులతో మాట్లాడి,వారికి అందుతున్న వైద్యం, ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు అందించే మెడిసిన్స్ తనిఖీ చేశారు. డ్యూటీలో ఉన్న వైద్యులు, నర్సులతో మాట్లాడుతూ వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరతను నర్సింగ్ సిబ్బంది ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వంతో, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి సిబ్బంది కొరత తీర్చేందుకు ప్రయత్నిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

కుల రహిత వనభోజనాలు

బుట్టాయగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రెడ్డిగణపవరం గ్రామంలోని చెరువు గట్టుమీద ఉన్న కట్టమలక్ష్మమ్మ గుడి వద్ద మంగళవారం కుల రహిత వనభోజనాలను ఏర్పాటు చేయగా గ్రామస్తులంతా పాల్గొన్నారు. ఉసిరి మొక్క వద్ద ప్రత్యేక పూజలు చేసి లలిత పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంటలకు సేంద్రియ ఎరువు వాడాలి

లింగపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పంటపొలాల్లో రసాయనాలు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ అన్నారు.మండలంలోని కలరాయనగూడెం, సింగగూడెం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగుపై రైతులకు సూచనలు చేశారు.బుధవారం మండలంలోని 8244 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా 5.52కోట్ల రూపాయల నగదు రైతుల ఖాతాల్లో జమ కానుందన్నారు. సర్పంచ్ బొంతు రాంబాబు, బొంతు శ్రీను, ముసునూరి రాంబాబు, కొల్లా దర్మారావు, రైతులు పాల్గొన్నారు.

రాట్నాలకుంట శ్రీరామలింగేశ్వరుడికి పూజలు

పెదవేగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం బహుళపక్షం, స్వాతీ నక్షత్రం, చతుర్దశిని పురస్కరించుకుని శైవ క్షేత్రాల్లో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. రాట్నాలకుంట శ్రీరామలింగేశ్వర స్వామికి బిల్వపత్ర పూజ, రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పావులూరి వీర వెంకట రామసత్య నారాయణ శర్మ మాట్లాడుతూ కార్తీక మాసంలో చేసే పూజలతో పుణ్యలోకం ప్రాప్తిస్తుందన్నారు.

1200 మందికి ఉచిత వైద్యం

ఏలూరు టూటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): త్రినిటి చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్, ఏలూరులోని జ్యోతిరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాంతినగర్ మన్నా చర్చ్ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు పాల్గొని 1200 మందికి పరీక్షలు చేశారు. డాక్టర్ సుహాస్ మాసిలమణి, డాక్టర్ మణిమాధురి, డాక్టర్ ప్రదీప్‌కుమార్, డాక్టర్ జి.అలీస్, డాక్టర్ సందీప్, డాక్టర్ గంగాభవాని, డాక్టర్ కిషోర్ కుమార్‌లు పాల్గొని వైద్య సేవలందించారు. మన్నాచర్చ్ బిషప్, మోస్ట్‌రెవరెండ్ ఎం.ఎలీషా రాజు, సీనియర్ పాస్టర్ జ్యోతిరాజు పాల్గొన్నారు.



మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నాయకురాలు ఎస్.కె.సుభాషిణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ఆర్పీలకు కాల పరిమితి రద్దు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మెప్మా టీఎంసీ నాగమణికి వినతిపత్రం అందజేశారు. మెప్మా ఆర్పీలు ఎం.నాగలక్ష్మి, జి.మోహిని కుమారి, నీలిమ, అష్రాఫ్, నాగలక్ష్మి, సునీత, విజయదుర్గ పాల్గొన్నారు.

దాడులకు నిరసనగా సీపీఐ ఆందోళన

బుట్టాయగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దేశంలోను, రాష్ట్రంలోను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులను అరికట్టాలని కోరుతూ జాతీయ పార్టీ పిలుపులో భాగంగా మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రదర్శన, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనలు జరిగాయి. మండల కార్యదర్శి చేడెం దుర్గ, సహాయ కార్యదర్శి బేతి కిషోర్ మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు పెరిగిరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ పి.వి.చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కురసం రవీంద్ర, చోడెం వెంకటేశ్వరావు, తెల్లం మునేశ్వరావు, చోడెం రమణ, బుద్దుల ముత్యాలమ్మ గిరిజనులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

యాంటీ బయోటిక్స్‌పై అవగాహన

కొయ్యలగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): యాంటీ బయోటిక్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని బయ్యన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం బయ్యన్నగూడెంలో యాంటీ బయోటిక్స్ వాడకంపై అవగాహన కల్పించారు. మోతాదుకు మించి యాంటీ బయోటిక్స్ వాడితే ప్రమాదకరమని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యవిస్తరణాధికారి సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణనను చేపట్టాలి

కొయ్యలగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జన, కుల గణనను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం కొయ్యలగూడెంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలపై దాడులు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయన్నారు. అలాగే కార్మిక చట్టాలను మార్చేలా కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. నాయకులు లక్ష్మణరావు, నారాయణ రావు, సతీశ్, బాజీ పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి చేస్తున్న శంకుస్థాపన

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

భీమడోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు జంక్షన్ నుంచి సంత మార్కెట్ వరకు రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలు నిధులు మంజూరు కావడంతో నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు కూటమి నేతలు పాల్గొన్నారు.

విద్యార్థి అభివృద్ధికి క్రీడలు దోహదం

పెదవేగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థి అభి వృద్ధికి క్రీడలు దోహదపడతాయని పెదవేగి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం టి.సత్యనారాయణ అన్నారు. పెదవేగిన శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మంగళవారం క్రీడలు నిర్వహించారు. పెదవేగి జడ్పీ హైస్కూల్ పీడీ శ్రీలక్ష్మి, గార్లమడుగు ఓరియంటల్ హై స్కూల్ పీడీ దుర్గాప్రసాద్, ఎస్ఎంసీ హైస్కూల్ పీడీ క్రీడాపోటీలు పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన

ద్వారకాతిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు కోరారు.సి.హెచ్.పోతేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు శీతాకాలంలో సంభవించే వైరల్, డెంగీ జ్వరాల పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వారానికో సారి తొట్టిలు, డ్రమ్ములను శుభ్రపరచుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు శ్రీజ, యజ్ఞశ్రీ, సిబ్బంది దుర్గమ్మ, మేక శ్రీనివాసరావు, కిశోర్, సునీత, నారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తీక వనసమారాధ

ద్వారకాతిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సంస్కృతీ, సంప్రదాయాలకు కార్తీక వనసమారాధనలు వేదికలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ద్వారకాతిరుమలలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో వనభోజనాలకు ఎంతో విశిష్టత ఉందన్నారు. ఆర్యవైశ్యులతో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జీలుగుమిల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తాటియాకులగూడెంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం నిరుపయోగంగా విద్యుత్ స్తంభాలు అనే శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా రామాలయం ఎస్సీ కాలనీలకు విద్యుత్ సరఫరా అందించారు. ఏడాదిగా గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులకు తెరపడింది. మరో పక్క జాతీయ రహదారి నిర్మాణ పనులు, స్థానిక కాలనీలకు రోడ్డు పనులు పూర్తయిన అనంతరం 24 గంటల విద్యుత్ సరఫరా లైన్‌లు సరిచేస్తామని ఏఈ నాగేషు చెప్పారు. లైన్‌మన్‌లు నాగేశ్వరరావు, జగన్‌మోహన్ ఉన్నారు.

డాగురే విగ్రహం వద్ద నివాళులు

ఏలూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కెమేరా సృష్టికర్త లూయిస్ డాగురే జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద ది ఏలూరు ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా గౌరవ అధ్యక్షుడు ఉప్పాల జగదీష్ బాబు, అసోసియేషన్ నాయకులు డాగురే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పలపాటి ప్రసాద్, కార్యదర్శి రవి శంకర్ బాబు, నాగ దుర్గాప్రసాద్, ఉజ్వల కుమార్, బర్మా బాలాజీ, ఎస్ఆర్ సాగర్ పాల్గొన్నారు.



ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థిని

రాజ్యాంగంపై అవగాహన అవసరం

లింగపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రాజ్యాంగం, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీధర్ అన్నారు. మండలంలోని లింగపాలెం, ధర్మాజీగూడెం గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగం, గ్రంథాలయాలతో ఉపయోగాలు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారులు జి.హెచ్.వెంకట రమణ, ఎస్ఏ లతీఫ్, ఉపాధ్యాయులు నాగమణి, అరుణ, త్రినాథ్ పాల్గొన్నారు.

శివయ్యకు ఘనంగా లక్షబిల్వార్చన

ద్వారకాతిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్న శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీకమాసంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఘనంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. అలాగే ఆలయ పరిసరాల్లోని శివలింగానికి భక్తులు, స్వయంగా అర్చనలు జరిపారు. గంగాపార్వతీ సమేతంగా కొలువుతీరిన శివయ్యకు జ్యోతిర్లింగార్చన జరిగింది.

పొగాకు నారు నర్సరీల పరిశీలన

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం టుబాకో బోర్డు పరిధిలోని చిన్నవారిగూడెంలోని నర్సరీలను అధికారులు మంగళవారం సందర్శించారు. రీజనల్ మేనేజర్ జీవీకే ప్రసాద్ ఆధ్వర్యంలో రైతు తిరుమలశెట్టి రవికి చెందిన పొగాకు నారు నర్సరీని సందర్శించారు. ఫీల్డ్ అసిస్టెంట్ హర్ష, రైతులు బుద్ధాల సత్యనారాయణ, మాదాసు సత్యనారాయణ, బుద్ధాల రాజు, పొనగంటి ముత్యయ్య, బండారు వీరస్వామి, దాకవరపు వెంకటేశ్వరరావు, బండారు ప్రసాద్ పాల్గొన్నారు.

తలసీమియా చిన్నారుల కోసం..

ఏలూరు క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో తలసీమియా వ్యాధిగ్రస్తులకు రక్తమార్పిడి చికిత్స అందిస్తున్నారని ఏలూరు సోనోవిజన్ మేనేజర్ పి.జగదీష్ తెలుసుకుని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో ఏలూరు జీవన్‌రోడ్డు ఏలూరు లోని సోనోవిజన్ షో రూమ్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తన సిబ్బందితో రక్తదానం చేయించారు. వీరికి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబీఎస్ వి.ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.రెడ్‌క్రాస్ వీఆర్వో కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆనారోగ్యంతో వీఆర్వో మృతి



పెదవేగి/దెందులూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పాక వీఆర్వో బొల్లె రాజేష్ (26) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందా డు. తండ్రి అకాల మరణంతో ఆ ఉద్యోగం రాజేశ్‌కు వచ్చింది. నాలుగు రోజుల కిందట అనారోగ్యానికి గురివడంతో ఏలూరు లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న అతడి ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. రాజేశ్ మృతి చెందిన విషయం తెలుసుకుని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, పెదవేగి తహసీల్దారు ఎన్వీ భ్రమరాంబ, ఆర్ఐ కేవీవీ.సారథి, వీఆర్వోలు వచ్చి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బొల్లే రాము, మోడూరి వెంకటేశ్వ రరావు, అత్తులూరి శ్రీనివాసరావు, నెర్సు గంగా రాజు, గోదావరి డీసీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఏలూరుఅర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై స్థానిక సీఆర్ఆర్ పీజీ కళాశాలలో మంగళవారం అవగాహన కల్పించారు. విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంగనాథ్ మాట్లాడుతూ డిజిటల్ అరెస్టు, సైబర్ భద్రత, సోషల్ మీడియా పరిమిత వినియోగం, సైబర్ క్రైం గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కరస్పాండెంట్లు శ్రీనివాసరావు, డాక్టర్ విష్ణు మోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, డైరెక్టర్ యలమర్తి బాబు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

చింతలపూడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రంపల్లి గ్రామంలో తడి, పొడి చెత్త పంచాయతీల్లో చేపట్టి వాటిని వేరు చేసే కార్యక్రమంపై సీఆర్పీలకు అవగాహన కార్యక్రమం శిక్షణ నిర్వహించారు.నూజివీడు డీఎల్పీవో మాట్లాడుతూ పంచాయతీల నుంచి చెత్త సేకరించడమే కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీపీఆర్సీ కో-ఆర్డినేటర్ ప్రసంగ రాజు సీఆర్పీ మహిళలకు శిక్షణనిచ్చారు. ఎంపీడీవో కె.పి.కామేశ్వరి పాల్గొన్నారు.

మైనార్టీలపై దాడులు అరికట్టాలి

జంగారెడ్డిగూడెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎస్సీఎస్టీబీసీమైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల సీపీఐ కార్యదర్శి జంపన వెంకటరమణరాజు మాట్లాడుతూ సీపీఐ కేంద్ర సమితి పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కె.స్లీవ జోజికి వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచే వసంతరావు, దాసరి నాగభూషణ రావు, చందా త్రిమూర్తులు,చాకిరి సోమరాజు, మంగారావు, జగన్నాథకృష్ణ పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం: ఏఎస్పీ

పెదపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):డ్రగ్స్ మహమ్మారి యువత జీవితాలను నాశనం చేస్తోందని, డ్రగ్స్‌కు నో చెప్పడం ముఖ్యమని అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావు తెలిపారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత ఇండోర్ స్టేడియం నుంచి విద్యార్థులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.మురళీధరరావు, డీన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

పోలవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పోలవరం మండల కేంద్రంలో గంగాభవాని సినిమా థియేటర్‌ను మంగళవారం జంగారెడ్డిగూడెం ఫైర్ ఆఫీసర్ జి.అబ్రహాం తనిఖీ చేశారు. నిర్వహించారు. అబ్రహాం మాట్లాడుతూ థియేటర్లలో అగ్ని ప్రమాద జాగ్రత్తలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశామన్నారు.సిబ్బంది వెంకటరాజు, థియేటర్ నిర్వాహకులు నారాయణ చౌదరి, బాజి, కిషోర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పోలవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రేపల్లెవాడలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వెటర్నరీ అసిస్టెంట్ శివానందం తెలిపారు. ఈ శిబిరంలో చూడు కట్టని పశువులకు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు, చికిత్సలు నిర్వహిస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

కామవరపుకోట/చింతలపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై దాడులు నిర్మూలించాలని కోరుతూ తహసీల్దార్ గెడ్డం ఎలీషాకు మంగళవారం సీపీఐ వినతి పత్రం అందజేసింది. చింతలపూడిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి తుర్లపాటి బాబు మాట్లాడుతూ దళిత, గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను ఆపాలన్నారు.


మద్ది క్షేత్రంలో భక్తులు (ఇన్‌సెట్‌లో) స్వామి

కిక్కిరిసిన మద్ది క్షేత్రం

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):కార్తీకమాసం చివరి మంగళవారం సందర్భంగా గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ ప్రదక్షిణలు, దీపారాధన, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తరం పూజలు నిర్వహించారు. 40 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దేవస్థాన నిత్యాన్నదాన సత్రంలో సుమారు 16 వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. మంగళవారం ఒక్కరోజే మద్ది ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ.9,95,438 ఆదాయం లభించినట్టు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

సుందరగిరిపై సుదర్శన హోమం

ద్వారకాతిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై లక్ష్మీనారసింహుని ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం జరిగిన సుదర్శన హోమం భక్తులకు కనువిందైంది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో సుందరీకరించిన యాగశాలలో పుణ్యాహవాచన, కలశస్థాపన నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చరణల నడుమ శ్రీసుదర్శన నృశింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ అనంత మూల మంత్రహోమం జరిగింది. ఆ తరువాత మూల విరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకం, హారతులు ఇచ్చారు.

ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గ్రంధి



తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు గ్రంధి సత్య నారాయణ ఎన్నికయ్యారు. ఇంజనీరింగ్ కళాశాలల నిర్వహణ, విద్యార్థుల ప్లేస్‌మెంట్, ఇతర విభాగాల్లో తమ కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దిన వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్య క్షునిగా పనిచేస్తున్న గ్రంధి సత్యనారాయణకు ఈ అవార్డు రావడం పట్ల ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, వాసవి కళాశాల కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, కళాశాల పాలకవర్గ సభ్యులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

సేవాభూషణ్, విద్యాభూషణ్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):తెలుగు రాష్ట్రాల్లో విశిష్టసేవలందిస్తోన్న ఉపాధ్యాయులు, వైద్యులు, క్రీడాకారులను గుర్తించి సేవాభూషణ్, విద్యాభూషణ్, కళాభూషణ్ జాతీయస్థాయి పురస్కారాలతో సత్కరించేందుకు ఉమ్మడిపశ్చిమగోదావరిజిల్లాలోని సంబంధిత రంగాల్లో సేవలందిస్తోన్న వ్యక్తులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైనవారికి ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులను అందజేస్తామన్నారు. ప్రతిభావంతులు వారి సేవలను, ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్‌లు, నాలుగు పాస్‌పోర్టుసైజు ఫొటోలను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 25లోగా ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15 చిరునామాకు పోస్టులో పంపాలని కోరారు. వివరాలకు ఫోన్‌నంబరు 96523 47207లో సంప్రదించాలన్నారు.

నిర్లక్ష్యాన్ని వీడకుంటే తీవ్ర చర్యలు

» దిశ సమావేశంలో ఎంపీ పుట్టా ఆగ్రహం.. వివిధ పనులకు డెడ్‌లైన్


మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యేలు రోషన్, చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం కమిటీ చైర్మన్ అయిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో వాడీవేడిగా జరిగింది. పలు అంశాలపై ఎంపీ చర్చించి, వివిధ అభివృద్ధి పనులను అధికారుల వివరణ తీసుకుని వాటికి డెడ్‌లైన్లు విధించారు. ఎంపీ వేసిన ప్రశ్నలకు పలువురు అధికారులు నీళ్లు నమిలారు. ఇప్పటికైనా మారి వివిధ పనులకు ప్రతిపాదనలు పంపిస్తే తాను పార్లమెంట్‌లో నిధులు సాధనకు రాబోయే సమావేశాల్లో ప్రస్తావిస్తానంటూ.. ఎంపీ సమావేశం అనంతరం అధికారులకు సూచించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మంజూరైన పనులు నిర్దేశిత సమయంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని, ఆర్వోబీల భూసేకరణ, ఇతర పనులపై వచ్చే మంగళ వారం సమీక్షిస్తాననగా, దీనిపై తాను వీసీలో పాల్గొంటానని ఎంపీ వివరించారు. జేసీ అభిషేక్ గౌడ, డీఆర్వో వి. విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి, సీపీవో వాసుదేవరావు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీ నిలదీత

పూడ్చిన గుంతలు ఇటీవల మొత్తం కొట్టుకుపోయాయని ఎంపీ పుట్టా ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ విజయ రత్నంను ప్రశ్నించారు. గుంతలు పూడుస్తున్నా కొత్తగా ఏర్పడుతున్నాయని ఎస్‌ఈగా చెప్పగా, ఇలా అనడం సరికాదని, ఇకమీదట పనులపై ప్రతిపాదనలు ఏకమొత్తంగా పంపాలన్నారు. కొల్లేరు ప్రజల విషయంలో మానవతా దృక్ప థంతో మెలగాలని కోరుతున్నా అటవీ అధికారు లు అలక్ష్యం వహిస్తున్నారు. దీనిపై సీఎంకు చెప్పాలా అని హెచ్చరించారు.

సోమవారం రాత్రి తాను ఏలూరు ఆసుపత్రిని తనిఖీ చేశా. నర్సులు లేరు.. శానిటేషన్ అధ్వానం. పేషంట్‌కు మందులు కూడా సక్రమంగా ఇవ్వరా... విచారణ చేయండి. శానిటరీ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. సూపరింటెండెంట్‌ను జవాబుదారీ లేదా అని నిలదీశారు.

జిల్లాలో పరిశ్రమలు ప్రజలకు వినియోగించే సీఎస్‌ఆర్ ఫండ్స్‌ను ఖర్చు చేయకుండా కప్పదాట్లకు దిగుతున్నారు. ఆయా పరిశ్రమల నుంచి జిల్లాలో సేవా కార్యక్రమాలకు ఒక శాతం సీఎస్‌ఆర్ ఫండ్‌ను ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తా... దీనిపై అధికారులు నివేదిక సమర్పించాలన్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ డెడ్‌లైన్

- జిల్లాలో 12 ఆర్వోబీల టెండర్ల ప్రక్రియను రైల్వే వెంటనే పూర్తిచేయాలి. వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభించాలి.
- కైకలూరు-గుడివాడ, కైకలూరు-భీమవరం రోడ్డు పనులు రాబోయే ఆరు నెలల్లో పూర్తి చేయకుంటే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి.
- ఎంపీ ల్యాడ్స్ కింద చేపట్టిన పనులు డిసెంబరుకు పూర్తి చేసి.. ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలి. ఈ ఏడాది పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.
- ప్రస్తుత దిశ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై 100 శాతం పురోగతి రాబోయే సమావేశంలో కనిపించాలి.

వారి పద్ధతి మారాలి : ఎమ్మెల్యేలు

- 'ఏలూరు జీజీహెచ్‌లో పరీక్షలు జరపకుండానే విజయవాడకు రిఫర్ చేస్తున్నారు. ఈ పద్ధతి మారాలి. రహదారుల నిర్వహణ సక్రమంగా లేదు. సీతంపేట ఆర్వోబీ వద్ద అలైన్‌మెంట్ మార్చాలి. వట్లూరు ఫ్లై ఓవర్ వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మించాలి' అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.
- నగరంలో బిషప్ హౌస్ ప్రాంతంలో ఇటీవల రోడ్డేశారు. మధ్యలో 70 మీటర్ల ముక్క వేయకుండా వదిలేశారు. గతంలోనే పూర్తిస్థాయిలో ప్రతిపాదన చేయలేదు. ప్రజలు నవ్వుకుంటున్నారు' అని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.
- 'ప్రభుత్వాసుపత్రి సేవలు పారదర్శకంగా ఉండేలా జంగారెడ్డిగూడెం, చింతలపూడిల్లో సేవలపై ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు యాప్ రూపొందించా. వైద్య సిబ్బందిలో జవాబుదారీతనానికి చర్యలు చేపట్టా' అని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు.
- 'ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో కొల్లేరు ప్రాంతంలో సొసైటీ భూముల్లో దాళ్వా సాగును అటవీ శాఖాధికారులు అడ్డుకుంటున్నారు. సంప్రదాయ వ్యవసాయమే చాలా గ్రామాల రైతులు చేసుకుంటున్నారు. వారికి అటవీశాఖాధికారులు అనుమతి ఇవ్వాలి' అని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు కోరారు.

ఉత్సాహంగా ఐక్యతా ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్నా జేసీ, ఏఎస్పీ

ఏలూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి మహోత్సవాలు సందర్భంగా 500 మంది యువత, విద్యార్థులతో మంగళవారం యూనిటీ మార్చ్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జేసీ మాట్లాడుతూ ప్రజలంతా ఐక్యతా భావంతో మెలగాలని అన్నారు. జిల్లా ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు మాట్లాడుతూ దౌత్య నైపుణ్యంతో 565 సంస్థానాలన్నింటిని మన జాతీయ జెండా కిందకు చేర్చిన గొప్ప యోధుడు వల్లభాయ్ పటేల్ అన్నారు. కేంద్ర క్రీడలు యువజన సంక్షేమ, మైభారత్ యువజన అధికారి సుంకర రాము, జడ్పీ సీఈవో యం శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయరాజు, సెట్‌వెల్ సీఈవో కేఎస్ ప్రభాకరరావు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ సహాయ సంచాలకులు బి. రామ్‌కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జి గిరిబాబు, పట్టణ ప్రముఖులు, ఎన్‌సీసీ, సేవా సంస్థల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులపై అధికారులతో మంత్రి సమావేశం


మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి వర్మ

భీమవరం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలపై కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మంగళవారం మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అధికారులతో సమావేశమయ్యారు. సోమవారం మునిసిపాలిటీ పరిధిలో పనులు చేసిన కాంట్రాక్టర్లు కేంద్రమంత్రి వర్మను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. దాదాపు రూ.18 కోట్ల 80 లక్షలు ప్రభుత్వం నుంచి తమకు రావాల్సి ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి వర్మ మునిసిపల్ శాఖ మంత్రి నారాయణతో మాట్లాడారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మునిసిపల్ అధికారులతో మాట్లాడారు. పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకుంటానని కాంట్రాక్టర్లకు మంత్రి హామీ ఇచ్చారు.


ఎర్రకాలువ వరదను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్ (ఫైల్)

ఎర్రకాలువ గట్లు పటిష్టతకు సీఎం సానుకూల స్పందన

నిడదవోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ఎర్ర కాలువకు వస్తున్న వర ద నీరు కారణంగా ఎర్ర కాలువ గట్లు కోతకు గురి అవుతున్న నేపథ్యంలో వాటి పటిష్టతకు మంత్రి దుర్గేష్ కేబి నెట్‌లో చేసిన విజ్ఞప్తికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి ఫ్లడ్ డేమేజ్ రిపేర్ నిధులతో మరమ్మతు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం నిడదవోలులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఎర్ర కాలువ ముంపు రైతాంగం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు.

శబరిమలలో తెలుగు స్వాముల ఆందోళన

ఉండి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శబరిమలలో ఉండి ప్రాంతా నికి చెందిన అయ్యప్పస్వాములకు అవమానం జరిగింది. క్యూలైన్ ఎక్కడ అని అడిగితే ఓ పోలీస్ బెల్ట్ చూపించారు. దాంతో స్వాములంతా నిరసన తెలిపారు. తెలుగువాళ్లకు అవమానం కలిగేలా అక్కడ వ్యవహరించారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. బెల్ట్ చూపించిన పోలీసును ఘటనా స్థలం నుంచి తప్పించారని తెలిపారు. ఆ తర్వాత ప్రత్యేక దర్శనం కల్పిస్తామంటూ పోలీసులు చెప్పి తప్పించుకోవడాన్ని తప్పుపట్టారు. ఉండికి చెందిన స్వాములు బైరెడ్డి అశోక చక్రవర్తి, బంటుమిల్లి నాగబాబులు అయ్యప్ప దర్శనం కోసం వెళ్లిన వారిలో ఉన్నారు. ఇప్పుడు నిరసన వీడియో వైరల్ అవుతోంది.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి: జేసీ

ఆచంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధి కారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆచంట ఎంపీడీవో కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయిలో ఆచంట, పోడూరు, పెనుమంట్ర, పెనుగొండ మండలాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. 48 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమయ్యేట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. గోనె సంచె 600 గ్రాములు మాత్రమే ఉండాలన్నారు. అలా కాకుండా కేజీగా చూడటం వల్ల రైతు నష్టపోతాడన్నారు. సంచికి వచ్చి 41 కేజీలు ధాన్యం తూకం కాకుండా 45 కేజీలు తూకం వేయాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు పాత్ర ఉంటే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించాలి

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా పరిరక్షించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆచంట వేమవరంలో రీసర్వే పనులను జేసీ రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రీ సర్వేకు సంబంధించిన రైతులకు మూడు రోజులకు ముందుగా సమాచారం అందించాలన్నారు.

మద్యం షాపు వద్ద కొట్లాట

మొగల్తూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):కెపిపాలెం సెంటర్‌లో గల మద్యం దుకాణం వద్ద సోమవారం రాత్రి మద్యం మత్తులో ఒక వ్యక్తిని కర్రతో కొట్టి తీవ్రంగా గాయపర్చిన సంఘటనపై మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పసలదీవి గ్రామానికి చెందిన కొట్టు శివన్నారాయణ కొంత కాలంగా కెపిపాలెంలో నివాసం ఉంటున్నాడు. అతని సోదరుడు సుబ్బారావుకు ఆపరేషన్ నిమిత్తం నరసాపురం ఆసుపత్రికి వెళ్ళి తిరిగి వస్తుండగా 10 గంటలు సమయంలో బ్రాందీషాపు వద్ద ఆగాడు. ఇదే సమయంలో చామకూరిపాలెంకు చెందిన హరి అనే వ్యక్తి మద్యం షాపు నిర్వాహకులతో గొడవకు దిగడంతో శివన్నారాయణ కలుగజేసుకుని హరిని సర్దిచెప్పేందుకు ప్రయత్నించాడు. దీంతో కోపానికి గురైన హరి శివన్నారాయణను చితకబాదారు. శివన్నారాయణ స్పృహకోల్పోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మంగళవారం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. జరిగిన సంఘటనపై బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మంగళవారం సాయంత్రం బ్రాందీ షాపు వద్ద ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న మొగల్తూరు ఎస్‌ఐ వై.నాగలక్ష్మీ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

'బలవంతంగా భూ సేకరణ దుర్మార్గం'

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్‌మెంట్ భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పాతబస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాలు, దళితులకు ఉపయోపగడే అసైన్డ్‌మెంట్ భూములను అభివృద్ధి పేరుతో బలవంతంగా భూసేకరణ చేయడం దుర్మార్గమన్నారు. దళితులు, పేదలకు సంక్షేమ పథకాలు సాకు చూపి సాగు చేసుకుంటున్న భూములను సైతం భూస్వాములకు కట్టబెట్టే యత్నానికి పూనుకున్నాయని మండిపడ్డారు.

బడుగులపై దాడులు ఆపాలి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితులు, మైనార్టీలు, గిరిజనులపై జరుగుతున్న దాడులు ఆపాలని, కుల వివక్షత అణచివేతను నిర్మూలించడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం పాతబస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా సీపీఐ సమితి కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు, గిరిజనులపై జరుగుతున్న దాడులు ఆపాలని, కుల వివక్షత, అణచివేతను నిర్మూలించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం నినాదంతో ధర్నాను నిర్వహించారు.

రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలి

పాలకోడేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు మాని రైతు పండించే పంటకు గిట్టుబాటు ధరను ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం పశ్చిమ గోదావరి జిల్లా 23వ జిల్లా మహాసభలు మంగళవారం అల్లూరి సీతారామ రాజు, డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లో జరిగింది.

ఆధార్ కార్డు అప్‌డేట్ చేయిస్తానని..

ఇద్దరు పిల్లలతో గోదావరిలో దూకేశాడు.. తండ్రీ కొడుకుల మృతదేహాలు లభ్యం


దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్, కుమార్తె జాహ్నవి (ఫైల్ ఫొటో)

యలమంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తండ్రి తన కుమారుడు, కుమార్తెలతో కలిసి బైక్ పై సోమవారం రాత్రి చించినాడ బ్రిడ్జి పైకి వచ్చి గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటుచేసుకున్నది. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థానికులు తెలిపిన వివరాలి.. మలికిపురం మండలం లక్కవరానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్ (43) సోమవారం సాయంత్రం తన కుమారుడు మోహిత్(14), కుమార్తె జాహ్నవి(11)లను తీసుకుని ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేయించే పని నిమిత్తం మలికిపురం వెళుతున్నామని భార్యకు చెప్పి బైక్‌పై బయటకువచ్చాడు. దుర్గాప్రసాద్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం రాత్రి బ్రిడ్జిపై బైక్, చెప్పులు, పర్స్ ఉండటంతో స్థానికులు వెళ్లిచూడగా బైక్ కవర్‌లో దుర్గాప్రసాద్ పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసె న్సు, బంధువుల ఫోన్ నంబర్ల కాగితం ఉంది. స్థానికులు బంధువులకు వెంటనే సమాచారం అందించారు. వారి ఆచూకీ కోసం మంగళవారం ఉదయం నుంచి పోలీసులు, గజ ఈత గాళ్లు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. తండ్రి దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్‌మృతదేహాలు మంగళవారం సాయంత్రం గోదావరిలో లభ్యమయ్యాయి. కుమార్తె జాహ్నవి ఆచూకీ లభించలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. చిన్నారులతో కలిసి తండ్రి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవడం స్థానికులను కలిచివేస్తోంది. ఆత్మహత్యకు కుటుంబ వ్యవహారాలే కారణంగా అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యలమంచిలి ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. అంతకుముందు ఈ ఘటనపై భార్య నాగవేణి తన భర్త, కుమార్తె, కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేసినట్టు మలికిపురం ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు.

సొసైటీ మాజీ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్‌కు రిమాండ్


బజ్జీని కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

దెందులూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):పోతునూరులోని భోగేశ్వరస్వామి సహకార సొసైటీలో అక్రమాలు రుజువైన కేసులో మాజీ అధ్యక్షుడు దూళిపాళ నాగేంద్ర వరప్రసాద్ (బజ్జీ)కి భీమడోలు సెషన్స్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. బజ్జీని భీమడోలు కోర్టుకు పోలీసులు సోమవారం తరలించగా, అక్కడ బెయిల్ కోసం నాగేంద్రవరప్రసాద్ లాయర్ ద్వారా కోర్టు వద్ద విశ్వప్రయత్నాలు చేశారు. ఈక్రమంలోనే భీమడోలు కోర్టు వద్ద వాదనలు జరుగుతున్న సమయంలోనే వైసీపీ,టీడీపీ నాయకులు ఇరువర్గాలు బాహాబాహీకి దిగడం చర్చనీయాంశమైంది. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు బజ్జీని ఏలూరు జిల్లా జైలులో రిమాండ్‌కు తరలిస్తూ మంగళవారం తెల్లవారుజామున జడ్జి ఉత్తర్వులిచ్చారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణగా ఉండాల్సిన స్థానంలో ఉండి అక్రమాలకు పాల్పడటంపై జడ్జి తీవ్రంగా పరిగణించి సెక్షన్ 409 కింద రిమాండ్ విధిస్తూ జడ్జి ప్రియదర్శిని ఆదేశాలు ఇచ్చారు. బజ్జీని దెందులూరు ఎస్‌ఐ ఆర్.శివాజీ రిమాండ్‌కు తరలించారు. ఈ సొసైటీలోనే రూ.అరకోటిపైనే నిధులు స్వాహా చేశారని ఆరోపణలపై ఆదివారం బజ్జీని దెందులూరు పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

అనుమతి లేకుండా బోటు నడుపుతున్న వ్యక్తిపై కేసు



పోలవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ వీరేశ్వ రస్వామి శివక్షేత్రం సమీపంలో గోదావరి నదిలో అనధికారిక ంగా ఫైబర్ బోటుపై ప్రయాణికులను తర లిస్తున్న వ్యక్తి పై కేసు నమో దు చేసినట్లు ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపారు. లైసెన్సు లేకుండా ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించ కుండా 28 మంది ప్రయాణికుల వద్ద 150 రూపాయలు చొప్పున వసూలు చేసి తరలిస్తున్న సమాచారం మేరకు బోటు నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. లైసెన్సు, రూట్ అనుమతి లేకుండా మానవ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టిన నేరం కింద అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం సీసాలు పట్టివేత

చింతలపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిగూడెం నుంచి చింతలపూడికి వచ్చే దారిలో బెల్టు షాపులపై దాడులు నిర్వహించగా ఎ.సత్యనారాయణ నుంచి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.

ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతున్న ఒకరికి జరిమానా

లింగపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని బైండోవర్ చేసి ఆ వ్యక్తికి జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి సారా అక్రమంగా అమ్మకాలు జరపడంతో పాటు ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతుండటంతో లింగపాలెం మండల తహసీల్దార్ నజీముల్లాషా వద్ద బైండోవర్ చేశామని, తహసీల్దార్ అతనికి ఐదువేల రూపాయల జరిమానా విధించినట్లు సీఐ అశోక్ తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్‌ఐ అబ్దుల్‌ఖలీల్, ఎక్సైజ్‌సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

దెందులూరు,నవంబరు 18(ఆంధ్రజ్యోతి):గుర్తు తెలియని వ్యక్తి రైలు రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. మంగళవారం దెందులూరు రైల్వే గేటు సమీపంలో ఉదయం గుర్తు తెలియని రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు కలిగి ఉంటాడని 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు కలిగి బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు నలుపు గీతలు గల పొడుగు చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. రైల్వే హెచ్‌సీ శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు

తండ్రి ఆస్తి కోసం తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ సృష్టి

కలెక్టర్‌కు మహిళ ఫిర్యాదు

ఏలూరు రూరల్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): కాలం చేసిన తన తండ్రి ఆస్తి, ఉద్యోగం కాజేయడానికి తన సోదరి ఏలూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ పొందారని, దీనిపై విచారణ చేసి తనకు న్యాయం చేయాలంటూ ఒక మహిళ జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. ఏలూరుకు చెందిన పులి స్పందన, చందన అక్క చెల్లెళ్లు. వీరి తండ్రి గోపాలరావు భీమవరం మండలం చిన్నరంగనిపాలెంలో మునిసిపల్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. గోపాలరావు భార్య ఝాన్సీ లక్ష్మీ రాణి 2012లో మృతి చెందగా గోపాలరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే స్పందన సోదరి చందన గరికపాటి పరిమళ పుష్ప అనే మహిళతో కుమ్మక్కై తన తండ్రి పుష్పను రెండో వివాహం చేసుకున్నాడని తప్పుడు ధృవపత్రాలతో మరణానంతరం లబ్ధి పొందాలని ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో తప్పుడు సమాచారంతో పాటు తన సంతకం లేకుండా ఫోర్జరీ సంతకంతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందారని ఆరోపించారు. ఎవరిదో పాస్‌పోర్టు ఐడిని జత చేసి తన స్టేట్‌మెంట్ కానీ డాక్యుమెంట్స్‌గాని సంతకం కానీ చేయకుండానే చేసినట్లు ఫోర్జరీ చేసి తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ పుట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తల్లి ఝాన్సీ లక్ష్మీ రాణి మొదటి భార్యగా పరిమళ పుష్ప రెండో భార్యగా పులి చందన విడాకులు పొందిన కుమార్తెగా సర్టిఫికెట్ మంజూరు చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం తాను ఎటువంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. తండ్రి ఉద్యోగాన్ని అక్రమ మార్గంలో పొందేందుకు తప్పుడు ఫ్యామిలీ సర్టిఫికెట్ పుట్టించారని దీనిపై విచారణ చేసి తనకు న్యాయం చేయాలని స్పందన విజ్ఞప్తి చేశారు.

బెల్ట్ షాపు నిందితులకు ఊరట

10 లీటర్ల లోపైతే ఒకే.. వచ్చే నెల 13న లోక్ అదాలత్‌లో రాజీకీ పచ్చజెండా

జిల్లా వ్యాప్తంగా 430 కేసులు



నరసాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన నిందితులకు ఊరట లభించనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం గడువును పెంచడంతో పాటు కొత్త నిబంధనలు జారీ చేసింది. 10 లీటర్లలోపు పట్టుబడిన కేసుల్ని లోక్ అదాలత్‌లో రాజీ చేసుకొనే అవకాశం కల్పించింది. దీంతో పాటు నిందితుడిపై గతంలో ఎక్సైజ్‌కు సంబంధించిన కేసులు ఉండకూడదు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఉన్న కేసుల్ని కూడా పరిష్కరించుకోవచ్చునని సూచించింది. వచ్చే నెల 13న జరిగే లోక్ అదాలత్‌లో ఈ కేసులు పరిష్కారం కానున్నాయి. జిల్లాలోని ఆరు ఎక్సైజ్ సర్కిల్స్ కార్యాలయాల్లో మొత్తం 430 కేసులు నమోదు అయ్యాయి. సుమారు 619 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 430 మందిపై కేసులు నమోదు అయ్యాయి. ఇవన్ని డిసెంబర్ 13న రాజీ కానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త ఎక్సైజ్ పాలసీని తీసుకొచ్చింది. వేలం పాట ద్వారా దుకాణాలను కేటాయించింది. అయితే బెల్ట్‌షాపులకు అనుమతి ఇవ్వలేదు. పాటదారులు బెల్ట్‌షాపులు నిర్వహిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించింది. దీంతో గ్రామాలు, పట్టణాల్లో కొంత మంది మద్యాన్ని కొనుగోలు చేసి అనధికారికంగా విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖలోని ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేస్తూ అనేక కేసులు నమోదు చేశారు. అయితే పది లీటర్ల లోపు పట్టుబడిన నిందితుల సంఖ్య తక్కువగా ఉంది. పది లీటర్ల దాటి పట్టు బడిన కేసు లే ఎక్కువగా ఉన్నాయి. కేసు రా జీలో ప్రభు త్వం మరో నిబం ధన పెట్టింది. పట్టుబడిన మద్యం బాటిల్ ధరకు నిందితుడు మూడు రెట్లు చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఎక్సైజ్ దాడుల్లో రూ.80 మద్యం బాటిల్స్ దొరికితే దానికి నిందితుడు మూడు రెట్లు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా అన్ని బాటిళ్ల ధరల్ని లెక్కగట్టి వాటికి పెనాల్టీలు విధిస్తూ సర్కిల్ వారీగా ఎక్సైజ్ పోలీసులు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఈ వివరాలను పట్టుబడిన నిందితుడికి తెలియజేసి కేసు రాజీ చేసుకోవాలంటే ఇంత మొత్తం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

ఈసారి గడువు పెంచారు

రాంబాబు, ఎక్సైజ్ సీఐ, నరసాపురం



గతంలో లోక్ అదాలత్‌లో ఈ తరహా కేసులు రాజీ చేశాం. అయితే ఈ సారి ప్రభుత్వం గడువు పెంచింది. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు నమోదైన పది లీటర్ల లోపు కేసుల్ని రాజీ చేసుకునే వెలుసుబాటు కల్పించింది. పట్టుబడిన మద్యానికి మూడు రెట్లు చెల్లించి నిందితుడు రాజీ చేసుకోవచ్చు. నరసాపురం సర్కిల్‌లో 136 కేసులు ఉన్నాయి. దీని వల్ల ప్రభుత్వానికి రూ.2.30లక్షలు పెనాల్టీ రూపంలో రానుంది.

రేపు కైకలూరులో జాబ్‌మేళా : కామినేని

కైకలూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. 13కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని 1010 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయ న్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ విద్యార్హతలును 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ యువకులు తమ బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్ తేవాలని, మరిన్ని వివరాలకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధుల 6281119575, 9676140314 సెల్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అన్నదాత సుఖీభవలో 9240 మంది రైతులకు లబ్ధి

నూజివీడు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవలో నూజివీడు మండలంలో 9240 మంది రైతు కుటుంబాలు లబ్ధి పొందుతున్నట్టు నూజివీడు మండల వ్యవసాయశాఖ అధికారి చెన్నారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 29 పంచాయతీల పరిధిలో 9240 మంది రైతు కుటుంబాలకు 6.09 కోట్లు రూపాయిలను సంబంధిత రైతుల ఖాతాలో నేరుగా జమ చేస్తారని తెలిపారు.

ఇద్దరు పిల్లలతో గోదావరిలో దూకిన తండ్రి



శిరిగినీడి దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్, కుమార్తె జాహ్నవి(ఫైల్)

యలమంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తండ్రి తన కుమారుడు, కుమార్తెతో కలిసి బైక్ పై సోమవారం రాత్రి చించి నాడ బ్రిడ్జిపైకి వచ్చి గోదా వరిలోకి దూకి ఆత్మ హత్యకు పాల్పడిన విషాద ఘటన చోటు చేసు కున్నది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థానికులు వివరాల ప్రకారం మలికి పురం మండలం లక్క వరం గ్రామానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్(43) సోమవారం సాయంత్రం తన కు మారుడు మోహిత్ (14), కుమార్తె జాహ్నవి (11)లను తీసుకుని ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేయి ంచే పని నిమిత్తం మలికిపురం వెళుతున్నామని భార్యకు చెప్పి బైక్‌పై బయటకు వచ్చాడు. దుర్గాప్రసాద్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం రాత్రి బ్రిడ్జిపై బైక్, చెప్పులు, పర్స్ ఉండటంతో స్థానికులు వెళ్లిచూడగా బైక్ కవర్‌లో దుర్గాప్రసాద్ పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసె న్సు, బంధువుల ఫోన్ నంబర్లు ఉన్న కాగితం ఉన్నాయి. స్థానికులు బంధువులకు వెంటనే స మాచారం అందించారు. వారి ఆచూకీ కోసం మంగళవారం ఉదయం నుంచి పోలీసులు, గజ ఈతగాళ్లు గోదావరిలో గాలింపు చర్యలు చేప ట్టారు. తండ్రి దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్ మృతదేహాలు మంగళవారం సాయంత్రం గోదావరిలో లభ్యమయ్యాయి. కుమార్తె ఆచూకీ లభించలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. ఈ ఘటన స్థానికులను కలిచివేస్తోంది. ఈ విషాద ఘట నతో లక్కవరం గ్రామంలో విషాదఛాయలు అల ముకున్నాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యలమంచిలి ఎస్ఐ కె.గురయ్య తెలిపారు. ఆత్మహత్యకు కుటుంబ వ్యవహారాలే కారణంగా అనుమానిస్తున్నరు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



చాట్రాయి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చనుబండ ఎస్సీ, ఎస్టీ కాలనీలో 15 రోజుల నుంచి తాగునీరు సరఫరా కాక పోవటంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని, వెంటనే నీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవాలని మంగళవారం మహిళలు రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజుల క్రితం రక్షిత మంచినీటి పథకం మోటారు కాలిపోయిందని, ఇంకా మరమ్మతులు చెయ్యలేదని, చేతి పంపులు కూడా పని చేయటం లేదని, తాగునీటి కోసం దూరంగా ఉన్న వ్యవసాయ బోరుబావులకు వెళ్ళి నీటిని తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నామని అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఉషారాణి

ఆగిరిపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఈ నెల 30 వరకు గ్రామాల్లో నిర్వహించనున్న సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అదనపు డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి సూచించారు. మంగళవారం ఆగిరిపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసి, కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆశా, ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. కేంద్ర బృందం రానున్న తరుణంలో మండలంలోని అన్ని గ్రామాలలో పరిశీలించి 14 రోజుల్లో ఈ సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, పీహెచ్‌సీ అధికారి డాక్టర్ జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు ట్రిపుల్ ఐటీ విద్యార్థినుల ఎంపిక

నూజివీడు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో మహిళలను ప్రోత్సహించే దిశగా ట్రిపుల్ ఐటీ విజయవంతంగా అడుగులు వేస్తోందనేందుకు నిదర్శనం ఇన్ఫోసిస్‌లో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు చెందిన 66 మంది విద్యార్థినులు ఉద్యోగాలను సాధించడమేనని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ సండ్ర అమరేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీతో కలిసి నిర్వహించిన నియామక డ్రైవ్లో 66 మంది బాలికలు ఇన్ఫోసిస్లో ఉద్యోగ అవకాశాలను సాధించి విద్యా సంస్థకు గర్వకారణంగా నిలిచారన్నారు. వారిని అభినందించారు. ఈఓ డాక్టర్ బి.లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డా.చిరంజీవి, ఫైనాన్స్ ఆఫీసర్ డా.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల నుంచి ఏలూరు వైపు

(5వ పేజీ తరువాయి)

జరిగినప్పటికి తర్వాత వారి జాడ తగ్గింది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం జిల్లాలో పోలీసు నిఘా పెంచారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తరచు కూంబింగ్ నిర్వహించేవారు. 2014 రాష్ట్ర విభజనతో తెలంగాణ నుంచి రెండు ఏజెన్సీ మండలాలు ఏలూరు జిల్లాలోకి వచ్చాయి. పోలవరంలో ప్రాజెక్టు నిర్మాణంతో ముఖ్యమంత్రులు, అధికారులు, వివిధ దేశాల నుంచి ఇంజనీర్లు వస్తున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టి ఏజెన్సీలో కూంబింగ్ చేస్తూనే ఉన్నారు.

ఎన్‌కౌంటర్లు.. అరెస్టులు

- గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా వున్న సమయంలో కుక్కునూరు మండలంలోనే పలు ఘటనలు జరిగాయి. ఓసారి గుర్తు చేసుకుంటే.. కుక్కునూరు మండలంలో గతంలో మావోయిస్టుల ఉనికి బయటపడింది.
- 2006 జూన్ 6న మావోయిస్టులు కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌ను పేల్చి వేశారు. రెడ్డిగూడెం అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు, కూంబింగ్ దళాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతి చెందారు.
- రేగులచెరువు ఆదివాసి గ్రామంలో నాటు తుపాకులు తయారు చేస్తూ ఆదివాసీలు పోలీసులకు దొరికారు.
- పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అప్పట్లో మండవ రామిరెడ్డి అనే కాంగ్రెస్ పార్టీ నాయకుడిని మావోయిస్టులు హతమార్చారు.
- 2000 మార్చి 17న బుట్టాయిగూడెం మండలం జలతారు వాగు వద్ద జరిగిన మొదటి ఎన్‌కౌంటర్‌లో వరంగల్‌కు చెందిన ఇద్దరు ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు, ఐదుగురు నక్సల్స్ మరణించారు. తర్వాత గూటాల ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు నక్సల్స్ చనిపోయారు. 2008 నవంబరు వరకూ మొత్తం ఎనిమిది ఎన్‌కౌంటర్లు జరిగాయి.
- 2002 మేలో ఏలూరులో జడ్పీ వద్ద పోలీసుల తనిఖీల్లో ఐదుగురు మావోయిస్టులు చిక్కారు.
- 1998లో విజయవాడ నుంచి రాయగడ పాసింజర్ రైలులో టిఫిన్ బాక్సుల్లో పేలుడు పదార్థాలను తీసుకుని వస్తుండగా ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో జారిపడి పలువురు సంఖ్యలో చనిపోయారు.
- రాష్ట్ర విభజన అనంతరం మావోయిస్టుల ఉనికి కొంతమేర తగ్గింది. పలుమార్లు మావోయిస్టుల సాహిత్యానికి సంబంధించి పోస్టర్లు, కరపత్రాలు, వెలువడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

అందని పశు వైద్యం

- ముసునూరులో శాశ్వత వైద్యుడు లేక పశుపోషకుల పాట్లు
- వైద్యం అందక చనిపోతున్న పశువులు



ముసునూరు పశు వైద్యశాల

ముసునూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముసునూరు పశు వైద్యశాలకు శాశ్వత వైద్యుడు లేకపోవడంతో పశువులకు సకాలంలో వైద్య సేవలు అందటం లేదని పశు పోషకులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ వైద్యుడిగా పనిచేస్తున్న ఎం.వెంకట చైతన్య కాట్రేనిపాడుకు బదిలీ అయి సుమారు రెండేళ్ళు పూర్తయింది. ఆయనే మరలా ముసునూరు వైద్యశాలకు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఇన్‌చార్జ్ వైద్యుడు వారంలో రెండు రోజులు మాత్రమే అందుబాటులో ఉండటంతో సిబ్బంది అరకొరగా చికిత్స అందిస్తున్నారని రైతులు వాపోతు న్నారు. గ్రామంలో పశువులు సుమారు 2200లు, జీవాలు 2500 ఉన్నాయి. ఇటీవల పశువులకు వింత వైరస్ సోకి వైద్యం అందక పాడి గేదెలు మృతి చెందాయని బాధిత రైతులు చెబుతున్నారు. అత్యధికం గా పశువులు, జీవాలు ఉన్న ఈ గ్రామంలో రెండేళ్లుగా శాశ్వత వైద్యుడు లేకపోవడంపై పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పర్మినెంటు వైద్యుడిని నియమిం చాలని పశు పోషకులు కోరుతున్నారు.

పశువులకు వైద్యం అందడం లేదు...



వైద్యం కోసం ఆసుపత్రికి పశువులను తోలుకువెళ్లినా డాక్టర్ లేరని సిబ్బంది చెబుతున్నారు. కనీసం అత్యవసర సేవలు అందించే నాథుడే లేరు. ఇటీవల వైరస్ సోకి సకాలంలో వైద్యం అందక రూ. లక్షల విలువ చేసే పాడి గేదెలు చనిపోయాయి. పశు సంపదను కాపాడు కునేందుకు తక్షణమే పర్మినెంట్ వైద్యుడిని నియమించాలి.

- పి.వెంకటేశ్వరరావు, పశుపోషకుడు, ముసునూరు.

నిర్లక్ష్యాన్ని వీడకుంటే తీవ్ర చర్యలు

- దిశ సమావేశంలో ఎంపీ ఆగ్రహం
- వివిధ పనులకు డెడ్‌లైన్

ఏలూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం కమిటీ చైర్మన్ అయిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో వాడీ వేడిగా జరిగింది. ప లు అంశాలపై ఎంపీ చర్చించి, వివిధ అభివృద్ధి పనులను అధికారుల వివరణ తీసుకుని వాటికి డెడ్‌లైన్లు విధించారు. ఎంపీ వేసిన ప్రశ్నలకు పలువురు అధికారులు నీళ్ల నమిలారు. ఇప్పటి కైనా మారి వివిధ పనులకు ప్రతిపాదనలు పంపిస్తే తాను పార్లమెంట్‌లో నిధులు సాధనకు రాబోయే సమావేశాల్లో ప్రస్తావిస్తానంటూ.. ఎంపీ సమావేశం అనంతరం అధికారులకు సూచిం చారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మంజూ రైన పనులు నిర్ధేశిత సమయంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని, ఆర్వోబీల భూసేకరణ, ఇతర పనులపై వచ్చే మంగళ వారం సమీక్షి స్తాననగా, దీనిపై తాను వీసీలో పాల్గొంటానని ఎంపీ వివరించారు. జేసీ అభిషేక్ గౌడ, డీఆర్వో వి. విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి, సీపీవో వాసుదేవరావు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీ నిలదీత

పూడ్చిన గుంతలు ఇటీవల మొత్తం కొట్టుకు పోయాయని ఎంపీ పుట్టా ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయ రత్నంను ప్రశ్నించారు. గుంతలు పూడుస్తున్నా కొత్తగా ఏర్పడుతున్నాయని ఎస్ఈగా చెప్పగా, ఇలా అనడం సరికాదని, ఇక మీదట పనులపై ప్రతిపాదనలు ఏకమొత్తంగా పంపాలన్నారు. కొల్లేరు ప్రజల విషయంలో మానవతా దృక్ప థంతో మెలగాలని కోరుతున్నా అటవీ అధికారు లు అలక్ష్యం వహిస్తున్నారు. దీనిపై సీఎంకు చెప్పాలా అని హెచ్చరించారు.

సోమవారం రాత్రి తాను ఏలూరు ఆసుపత్రిని తనిఖీ చేశా. నర్సులు లేరు.. శానిటేషన్ అధ్వా నం. పేషంట్‌కు మందులు కూడా సక్రమంగా ఇవ్వరా... విచారణ చేయండి. శానిటరీ కాంట్రా క్టను రద్దు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. సూపరింటెండెంట్‌ను జవాబుదారీ లేదా అని నిలదీశారు.

జిల్లాలో పరిశ్రమలు ప్రజలకు వినియోగించే సీఎస్ఆర్ పండ్స్‌ను ఖర్చు చేయకుండా కప్ప దాట్లకు దిగుతున్నారు. ఆయా పరిశ్రమల నుంచి జిల్లాలో సేవా కార్యక్రమాలకు ఒక శాతం సీఎస్ఆర్ ఫండ్‌ను ఏలూరు పార్లమెంట్ నియో జకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తా... దీనిపై అధి కారులు నివేదిక సమర్పించాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యేలు రోషన్, చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి



అభివృద్ధి పనులకు ఎంపీ డెడ్‌లైన్

- జిల్లాలో 12 ఆర్వోబీల టెండర్లు ప్రక్రియ ను రైల్వే వెంటనే పూర్తిచేయాలి. వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభించాలి.
- కైకలూరు-గుడివాడ, కైకలూరు-భీమవరం రోడ్డు పనులు రాబోయే ఆరు నెలల్లో పూర్తి చేయకుంటే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి.
- ఎంపీ ల్యాడ్స్ కింద చేపట్టిన పనులు డిసెంబరుకు పూర్తి చేసి.. ప్రారంభోత్స వాలకు సిద్ధం చేయాలి. ఈ ఏడాది పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.
- ప్రస్తుత దిశ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై 100 శాతం పురోగతి రాబో యే సమావేశంలో కనిపించాలి.

వారి పద్ధతి మారాలి : ఎమ్మెల్యేలు

- 'ఏలూరు జీజీహెచ్‌లో పరీక్షలు జరపకుండానే విజయవాడకు రిఫర్ చేస్తున్నారు. ఈ పద్ధతి మారాలి. రహదారుల నిర్వహణ సక్రమంగా లేదు. సీతంపేట ఆర్వోబీ వద్ద అలైన్‌మెంట్ మార్చాలి. వట్లూరు పై ఓవర్ వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మించాలి' అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.
- నగరంలో బిషప్ హౌస్ ప్రాంతంలో ఇటీవల రోడ్డేశారు. మధ్యలో 70 మీటర్ల ముక్క వేయకుండా వదిలేశారు. గతంలోనే పూర్తిస్థాయిలో ప్రతిపాదన చేయలేదు. ప్రజలు నవ్వుకుంటున్నారు' అని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.
- 'ప్రభుత్వాసుపత్రి సేవలు పారదర్శకంగా ఉండేలా జంగారెడ్డిగూడెం, చింతలపూడిల్లో సేవలపై ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు యాప్ రూపొందించా. వైద్య సిబ్బందిలో జవాబుదారీతనానికి చర్యలు చేపట్టా' అని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తెలిపారు.
- 'ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో కొల్లేరు ప్రాంతంలో సొసైటీ భూముల్లో దాళ్వా సాగును అటవీ శాఖాధికారులు అడ్డుకుం టున్నారు. సంప్రదాయ వ్యవసాయమే చాలా గ్రామాల రైతులు చేసుకుంటున్నారు. వారికి అటవీశాఖాధికారులు అనుమతి ఇవ్వాలి' అని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు కోరారు.



టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

కైకలూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పించాలని ఏలూరు జిల్లా పరీక్షల పరిశీలనాధికారిణి ఆశా అన్నారు. మంగళవారం కైకలూరు ఓరియంటల్ జడ్పీ హైస్కూల్, భాష్యం స్కూల్, జడ్పీ బాలికల హైస్కూల్, హోలీక్రాస్, భుజబలపట్నం జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈఓ-2 వి. శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు కట్టా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్ల పంపిణీ

చాట్రాయి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మంత్రి పార్థసారథి కుమారుడు నితిన్‌కృష్ణ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం చాట్రాయి పీహెచ్‌సీలో రోగులకు కూటమి నాయకులు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు తుమ్మల జగన్, కరణాకర్, ఆదిమూలం శర్మ, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బలివేలో ప్రత్యేక పూజలు



ముసునూరు, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రి సందర్భంగా బలివే రామలింగేశ్వర స్వామికి ఏలూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, రుద్రహోమం, జ్యోతిర్లింగార్చన ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని అందించారు. ఆలయ చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, ఈవో పామర్తి సీతారామయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నాయీ బ్రాహ్మణులు రాజకీయాల్లో రాణించాలి: కామినేని



వనసమారాధనలో మాట్లాడుతున్న కామినేని

కలిదిండి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులు రాజకీయాల్లో రాణించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలిదిండి మార్కెట్ యార్డులో నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కమ్యూ నిటీ హాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా నన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షు డు, శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయ బోర్డు సభ్యుడు ఉప్పుటూరి బాలగురు స్వామి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్, నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి విజయ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.


పాఠశాల స్థల దాతలకు సత్కారం

చినతాడినాడ జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. డీఎస్సీలో ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థులను, పాఠశాల స్థల దాతలు పెదరాము, చినరామును సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు విరాళాలు ఇవ్వటం అభినందనీయమన్నారు. సర్పంచ్ ఏసుబాబు, ఎస్ఎంసీ చైర్మన్ సత్యవతి, ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎం పి.దామోదర రావు, కాంప్లెక్స్ చైర్మన్ రమణ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కైకలూరు: పేదల వైద్యానికి సీఎం సహాయనిధి దోహదపడుతుందని కామినేని అన్నారు. మంగళవారం వరహాపట్నంలోని తన స్వగృహం వద్ద సీఎం సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ముదినేపల్లి మండలం వైవాక గ్రామానికి చెందిన గుబ్బల భీముడుకు రూ.68172, ఊటుకూరుకు చెందిన నారగాని కృష్ణశ్రీకి రూ.24345, మండవల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన ముళ్లపూడి రామశ్రీను రూ.30945లు మొత్తం రూ.1,23,462లు చెక్కులను పంపిణీ చేశారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ పీరయ్య

నూజివీడు టౌన్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణలో అలసత్వం లేకుండా నూజివీడు పట్టణాన్ని సంపూర్ణ పారిశుధ్యనగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని నూజివీడు మున్సిపల్ కమిషనర్ పీరయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని 19, 20 వార్డులలో పర్యటించారు. ఈసందర్భరంగా పారిశుధ్య మెరుగుదలలో తీసుకోవల్సిన చర్యలపై కార్మికులకు సూచనలు చేశారు. రహదారులపై చెత్త వేయ కుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన కూడళ్లలో చెత్త వేసే వారిపై అపరాధ రుసుం విధిస్తున్నట్లు తెలిపారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి

కైకలూరు: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని ఎంపీడీవో ఆర్. రాజాబాబు అన్నారు. మంగళవారం కైకలూరు వెలుగు కార్యాలయంలో పరిశుభ్రత-పచ్చదనం నిర్వహణపై సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కడబడితే అక్కడ చెత్తవేసే వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఏపీవో చరణ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే హాని లేని పర్యావరణం

ముదినేపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్‌పై మంగళవారం మండలంలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్ర, ఎస్‌హెచ్‌జీలకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో వై.రామకృష్ణ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత నిరంతర ప్రక్రియంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో అశోక్, మండల పరిషత్తు కార్యాలయ ఏవో మేకా రమణారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



కైకలూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలోని పార్వతీ సమేత రామలింగేశ్వర, రామేశ్వరస్వామివార్ల శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారి కళామండపం వద్ద ఉప్పులూరి ముత్తంరాజు, ఉప్పులూరి రాజశేఖర్ దంపతులు కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. వేదమంత్రాల మంత్రోచ్ఛరణల మధ్య, మేళతాళాల మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు.

దళితులపై దాడులు అరికట్టాలి: సీపీఐ

నూజివీడు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు అరికట్టాలని సీపీఐ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం నూజివీడు పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో ఏఐటీయూసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చల్లసాని వెంకటరామారావు మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఐ నూజివీడు పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, కార్మిక సంఘం నాయకులు రాంబాబు, దుర్గాప్రసాద్, కృష్ణ, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కోడూరులో ఇళ్ల స్థలాల పరిశీలన

ముదినేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం కోడూరులో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దార్ లతీఫ్ పాషా పరిశీలించారు. నాలుగేళ్ల క్రితమే లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాల్లో గృహాలు నిర్మించేందుకు అనువుగా లేని పరిస్థితిని గమనించారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలోని ఆ లేఅవుట్‌లో ముళ్ల పొదలు తొలగింపుతోపాటు, స్థలాలు పూడిక, తాగు నీరు, విద్యుత్, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరాన్ని తహసీల్దార్ గుర్తించారు. అనం తరం ఆయన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి స్థలాల పూడిక, గృహాల మంజూరు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

షష్ఠి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు



ముదినేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని సింగరాయ పాలెం - చేవూ రుపాలెం సెంట రులో గల శ్రీ వల్లీ దేవ సేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి డిసెంబరు 7 వరకు జరుగనున్న షష్ఠి కల్యాణోత్సవాలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికార్లు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణలకు భారీ ఎత్తున ఆర్చ్‌లు నిర్మిస్తున్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి పర్యవేక్షణలో పుట్ట వద్ద భక్తుల తొక్కిసలాట లేకుండా దైవ దర్శనం సాఫీగా జరిగేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు. తొలి రోజు భారీగా భక్తులు ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం ఉన్నందున దేవస్థానం ప్రాంగణంలో ఎక్కువ సంఖ్యలో క్యూ లైన్లను నిర్మిస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

35 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

నూజివీడు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసలై సెల్‌ఫోన్ దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని నూజివీడు సర్కిల్, చాట్రాయి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్వీ ప్రసాద్ తెలిపారు. నూజివీడు రూరల్ సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చాట్రాయి అంజనేయస్వామి ఆలయం వద్ద ఏలూరు పాములు దిబ్బకు చెందిన ముంగి ప్రసాద్ కుమారుడు ముంగి సాగర్, మరో బాలుడుని అదుపులోకి తీసుకుని వారి నుంచి మొత్తం 35 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటిలో ఈ నెల 16న చాట్రాయి మండల కేంద్రంలోని సెల్ఫోన్ దుకాణంలో చోరీ చేసిన 25 సెల్‌ఫోన్లు అదే రోజు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం నరసాపురంలోని సెల్ఫోన్ దుకాణం నుంచి చోరీ చేసిన 10 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను తిరువూరు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందిని ఆయన అభినందించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ముదినేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వణుదుర్రు గ్రామానికి చెందిన వాసుపల్లి శ్రీరామ్(26), శిరివల్లి అను రెండేళ్ళ క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఒక పాప. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్త ప్రవర్తనను అనుమానిస్తున్న అను పుట్టింటికి వెళ్ళడం, పెద్దల్లో రాజీ చేయడం తిరిగి భర్త దగ్గరకు రావడం జరుగుతూనే ఉంది. సుమారు నాలుగు నెలల క్రితం ఆమె పుట్టింకి వెళ్లిపోయి తిరిగి వచ్చేందుకు నిరాకరించడంతో శ్రీరామ్ మనస్తాపం చెంది ఈ నెల 14న ముదినేపల్లిలో గడ్డిమందు తాగేశాడు. ఇది చూసిన వారు వెంటనే అతనిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు ముదినేపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కె శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రేపల్లె బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... బలగం వీణీషణ గారి భార్య మరియమ్మ గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్రయములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్రయములు రానిచో మా క్లయింట్ సదరు బలగం శ్యామలాదేవి గారికి ఋణం మంజూరు చేయును. షెడ్యూలు : కృష్ణా జిల్లా, అవనిగడ్డ సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా నాగాయలంక మండలము కమ్మనమోలు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన కమ్మనమోలు గ్రామము తాలూకు ఆస్తి మాలో 1వ వారికి అనువంశికముగా సంక్రమించి మాలో 1వ వారి పేరా శ్రీ గవర్నమెంటు వారి లెక్కలలో నమోదు కాబడిన అనాది నేటి వరకు యాతుక్త హక్కు భుక్త స్వాధీనములో గల సీతు దఖలు పరచిన ఆస్తి వివరం. ఆర్.ఎస్. నెం. 516-18 య 0.39లు లో సీతు దఖలు పరచిన 397 చ.గలు కు హద్దులు. తూర్పు : ఆర్ అండ్ బి రోడ్డు హద్దు దక్షిణం : బలగం పోతురాజు గారి ఇల్లు స్థలం హద్దు. పడమర : మా తాలూకు స్థలం హద్దు. ఉత్తరం : కొలా నాగరాజ్ గారి స్థలం హద్దు. యీ హద్దుల మధ్య 397 చ.గలు లేక 331.89 చ.మీ.లు స్థిరాస్తి నివేశ స్థలం అందులోని 3-85 డోరు నెంబరు గల ఆర్‌సీసీ దాబా. ఈ ఆస్తి కి సంబంధించిన DOC No: 3650/2022, SRO. అవనిగడ్డ

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234